# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU


TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక


వరంగల్ | శనివారం - 10 - మే - 2025 | సంపుటి : 2 | సంచిక : 349 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## ఐపీఎల్ 2025 వారం వాయిదా



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ వాయిదా పడింది. భారత్ - పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ టోర్నీ నిర్వహణకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు టోర్నీ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. "ప్రస్తుత పరిస్థితుల్లో అనేక ఫ్రాంచైజీలు ఆటగాళ్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై ఐపీఎల్ పాలక మండలిలో చర్చించాం. ప్రసారకర్తలు, స్పాన్సరర్లు, అభిమానుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాం. మన సాయుధ బలగాల స్థైర్యం, సన్నద్ధతపై మాకు పూర్తి విశ్వాసం ఉన్నప్పటికీ.. అందరి అభిప్రాయాలను గౌరవించి ఈ నిర్ణయం తీసుకున్నాం.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో దేశానికి బీసీసీఐ పూర్తి మద్దతు ప్రకటిస్తోంది. మన సాయుధ బలగాల ధైర్యం, నిస్వార్థ సేవకు సెల్యూట్ చేస్తున్నాం" అని ఐపీఎల్ తమ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చింది.

## రేపు తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు



తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఆదివారం ఉదయం 11 గంటలకు TG EAPCET ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేయనున్నారు. మే 11వ తేదీ ఉదయం 11 గంటలకు విద్యార్థులు సాధించిన ర్యాంకులు, మార్కుల జాబితాను విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇటీవల తెలంగాణ ఎప్‌సెట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్- ఫార్మసీ విభాగాల ప్రిలిమినరీ కీ విడుదల చేసిన అధికారులు.. తాజాగా ఫలితాల విడుదలకు రంగం సిద్ధం చేశారు. తెలంగాణలో ఏప్రిల్ 29 నుంచి మే 4 వరకు ఈఏపీ సెట్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్ష, మే 2 నుంచి 4 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష పరీక్షలు నిర్వహించారు. దాదాపు 3లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు.

# పాక్ మళ్లీ పునరావృత దాడులు
# డ్రోన్లు, క్షిపణులతో నిష్ఠూర ప్రయత్నం

### భారత సైన్యం కౌంటర్ దాడులతో ఘాటుగా స్పందన

- 26కుపైగా ప్రాంతాలపై క్షిపణి, డ్రోన్ దాడులు – సైన్యం ధీటైన ప్రతీకారం
- శ్రీనగర్ నుంచి జోద్‌పూర్ దాకా బ్లాకౌట్ – చీకట్లో భద్రతా చర్యలు
- పాక్ కాల్పుల్లో మహిళ మృతి – 18 మందికి గాయాలు
- మోదీ సమీక్ష, సైన్యం అప్రమత్తం – టెరిటోరియల్ ఆర్మీ విధుల్లోకి?
- విమానాశ్రయాల మూసివేత మే 15 దాకా – వైద్య సిబ్బంది సెలవులు రద్దు
- ఇరాన్, సౌదీ దేశాలకు పాక్ మొర – ఉద్రిక్తతల పరిమితికి ప్రయత్నం
- పలు జిల్లాల్లో ప్రజల నివాసాలు ఖాళీ – బంకర్లకు తరలింపు
- పాక్‌పై కఠినంగా స్పందించాలి – రాజ్‌నాథ్ ఆదేశం





పాకిస్తాన్ దాడుల గురించి విదేశాంగ మంత్రిత్వ శాఖ, రక్షణ శాఖలు కలిసి తాజాగా మీడియా సమావేశం నిర్వహించి కీలక విషయాలు చెప్పారు. ప్రధానంగా భారత్‌లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్ ఈ దాడులు చేసినట్లు కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. భారత గగనతలంలోకి పాకిస్తాన్ యుద్ధ విమానాలు, డ్రోన్లు వచ్చాయని కల్నల్ సోఫియా ఖురేషీ తెలిపారు. 300 నుంచి 400 డ్రోన్లతో పాకిస్తాన్ దాడులు చేసినట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో ఎల్‌ఓసీ వెంబడి పాక్ నాన్‌స్టాప్‌గా దాడులకు తెగబడుతోందని వివరించారు. ఈ కాల్పులకు ప్రతీకారంగా భారత్ చేసిన దాడుల్లో పాక్ సైన్యానికి తీవ్ర నష్టం జరిగినట్లు చెప్పారు. భారత్‌లోని 36 చోట్ల దాడులు చేసేందుకు ఈ 400 డ్రోన్లను పాకిస్తాన్ ప్రయోగించేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. అయితే ఈ డ్రోన్లను ఎక్కడికక్కడ భారత డిఫెన్స్ వ్యవస్థ కుప్పకూల్చినట్లు వివరించారు.

2 లో..

## భద్రతా వ్యూహంపై ప్రధాని మోదీ కీలక సమీక్ష

- త్రివిధ దళాల ప్రస్తుత, మాజీ అధికారులతో మంతనాలు
- పాక్ కవ్వింపు చర్యలకు గట్టి ప్రతీకారం – సైన్యానికి పూర్తి స్వేచ్ఛ
- మాజీ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌లతో భద్రతా వ్యూహాలపై చర్చ
- ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ ప్రతీకార చర్యలు ప్రారంభం
- ఎల్‌ఓసి వద్ద విస్తృత కాల్పులు – పూంచ్, ఉరి, కుప్వారా కేంద్ర బిందువులు
- విదేశాంగ శాఖ, సైన్యం సంయుక్తంగా పాకిస్తాన్ దాడులపై వివరాలు వెల్లడి
- ప్రభుత్వం అన్ని స్థాయిల్లో సన్నద్ధత – భవిష్య భద్రతా మార్గసూచులపై దృష్టి



(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)

భారత్‌పాకిస్థాన్ ఉద్రిక్తతల వేళ భారత ప్రధానమంత్రి నివాసంలో కీలక సమావేశం జరుగుతోంది. త్రివిధ దళాలకు చెందిన ఉన్నతాధికారులు ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. సరిహద్దుల్లోని తాజా పరిస్థితిని ప్రధాని మోదీకి వివరించారు. పాకిస్తాన్‌పై చర్యల విషయంలో సైన్యానికి ఇప్పటికే పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు ప్రధాని మోదీ. దీంతో పాకిస్థాన్ కవ్వింపు చర్యలను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొడుతోంది. అలాగే, రక్షణ విధానంపై ప్రధాని మోదీ కీలక సమావేశం అయ్యారు. ప్రస్తుత, మాజీ సైనిక అధిపతులతో చర్చలు జరిపారు. ప్రధానమంత్రి మోదీ సమావేశం కేవలం ఒక సాధారణ సంభాషణ కాదు, అనుభవజ్ఞుల సహాయంతో భవిష్యత్తు కోసం ఒక నిర్దిష్ట విధానాన్ని రూపొందించే ప్రయత్నం జరిగినట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీ సమావేశం,




ఆర్మీ చీఫ్‌లు, రక్షణ విధానం, పాకిస్తాన్ ఉద్రిక్తత, భద్రతా వ్యూహం, భారత సైన్యం పనితీరుపై సుదీర్ఘంగా చర్చించారు. దేశ భద్రతా పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం(మే 09) ప్రస్తుత, మాజీ సైన్యాధిపతులతో వేర్వేరుగా ముఖ్యమైన సమావేశాలు నిర్వహించారు. ఢిల్లీలోని ప్రధానమంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ఆర్మీ, వైమానిక దళం, నావికాదళానికి చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మిగతా 2లో..

## గచ్చిబౌలిలో మిస్ వరల్డ్ మహోత్సవానికి రంగం సిద్ధం

- మే 31 వరకు ప్రపంచ అందగత్తెల ఉత్సవం
- స్టేడియం చుట్టూ తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే అలంకరణలు
- ఇండోర్ స్టేడియంలో ర్యాంప్ వాక్ రిహార్సల్స్ – భారీ భద్రతా ఏర్పాట్లు
- కేవలం లేడీ పోలీసుల సమక్షంలోనే రిహార్సల్‌స్‌కు అనుమతి
- మిస్ వరల్డ్ 2025 కార్యక్రమాలు శనివారం నుంచి మే 31 వరకు
- స్టేజ్ క్యాట్ వాక్ ప్రాక్టీస్ – అంతర్జాతీయ అందగత్తెల పాల్గొనడం ఆకర్షణీయం
- పోటీ ఏర్పాట్లు తుది దశకు – గచ్చిబౌలిలో సందడి వాతావరణం








'మిస్ వరల్డ్' పోటీల కోసం గచ్చిబౌలి స్టేడియంతో పాటు పరిసరాల కూడళ్లను విద్యుత్తు కాంతులతో సుందరంగా ముస్తాబు చేశారు. స్టేడియం చుట్టూ తెలంగాణ చరిత్ర, సంస్కృతి చాటే చిత్రాలు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు, శనివారం నుంచి ప్రారంభమయ్యే మిస్ వరల్డ్ 2025 వేడుకలు మే 31న ముగుస్తాయి. ఈ పోటీలలో పాల్గొంటున్న ఆయా దేశాలకు చెందిన అందగత్తెలు గచ్చిబౌలి స్టేడియంలో రిహార్సల్స్ చేస్తున్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ఆయా దేశాలకు చెందిన అందగత్తెలు ర్యాంప్ వాక్ రిహార్సల్స్ చేశారు. స్టేజ్ పై నిర్వహించే క్యాట్ వాక్ ను ఇక్కడ అందగత్తెలు రిహార్సల్స్ చేశారు. భారీ బందోబస్తు మధ్య రిహార్సల్స్ సాగాయి. కొద్దిమంది అధికారులను, కేవలం లేడీ పోలీసులను మాత్రమే లోపలికి అనుమతించారు. వారి సమక్షంలోనే రిహార్సల్స్ సాగుతున్నాయి. అలాగే గచ్చిబౌలి స్టేడియం పరిసరాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మిస్ వరల్డ్ పోటీ లకు సంబంధించిన ఏర్పాటు కూడా తుది దశకు చేరుకున్నాయి.

2 లో..

## జాతీయ రక్షణ నిధికి సీఎం రేవంత్ విరాళం

### సైనికులకు అండగా తెలంగాణ

ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

ఉగ్రవాద నిర్మూలనకు ధైర్యంగా పోరాడుతున్న సాయుధ దళాలకు అండగా నిలిచేందుకు.. ఒక నెల వేతనాన్ని విరాళంగా జాతీయ రక్షణ నిధికి ఇస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దేశ రక్షణ కోసం ప్రాణాలకు తెగించి పోరాడుతున్న సైనికులకు చేయూతగా నిలిచే ఉద్యమంలో.. పార్టీ సహచరులు, సన్నిహితులు, పౌరులందరూ చేరాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 'భారత్ విజయ తీరాన్ని చేరేంతవరకు అందరం ఐక్యంగా సైన్యానికి అండగా నిలవాలని కోరుతున్నా'.. అని ఎక్స్ వేదికగా ఆయన ట్వీట్ చేశారు. జాతీయ రక్షణ నిధికి ఇప్పటికే రాష్ట్రంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నెల వేతనాన్ని విరాళంగా ఇవ్వనున్నట్టు ప్రకటించారు. తా ము కూడా అదే బాటలో వెళ్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. రా ష్ట్రంలోని లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు కూడా ముందుకు రావాలని ఎక్స్ వేదికగా ఆయన కోరారు. ఒక రోజు వేతనాన్ని సైన్యానికి విరాళంగా ఇవ్వాలని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ తీర్మానించింది.

## తెలుగు జవాన్ వీర మరణం

- పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో తెలుగు జవాన్ మురళీ నాయక్ మృతి
- వీర జవాన్‌ది ఏపీలోని సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండా
- శనివారం స్వగ్రామానికి వీర జవాన్ పార్థివ దేహం




(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌ను సహించలేని దాయాది పాకిస్థాన్ వక్ర బుద్ధితో భారత సరిహద్దు ప్రాంతాలపై క్షిపణి, డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. ఈ క్రమంలో జమ్మూకశ్మీర్‌లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో తెలుగు జవాన్ వీర మరణం పొందారు. మృతిచెందిన జవాన్‌ను మురళీ నాయక్‌గా గుర్తించారు. వీర జవాన్‌ది ఏపీలోని సత్యసాయి జిల్లా గోరంట్ల మండల పరిధిలోని కల్లి తండా. గురువారం రాత్రి సరిహద్దు వెంబడి పాక్ కాల్పులు జరపగా మన సైన్యం కూడా దీటుగానే బదులిచ్చింది. ఈ ఎదురుకాల్పుల్లో మురళీ నాయక్ చనిపోయినట్లు సమాచారం. శనివారం స్వగ్రామానికి వీర జవాన్ పార్థివ దేహం రానున్నట్లు తెలుస్తోంది.

కాగా, వీర జవాన్ మురళీ నాయక్ సోమందేపల్లి మండలం నాగినాయని చెరువుతండాలో పెరిగాడు. సోమందేపల్లిలోని విజ్ఞాన్ స్కూల్‌లో చదివాడు. జవాన్ మృతితో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో స్వగ్రామం కల్లి తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- ఈ నెల చివరిలోగా ప్రెస్ అకాడెమీ భవనం ప్రారంభిస్తాం
- రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలైన జర్నలిస్టులకు అలాగే వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని తెలిపారు.వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలసరి పెన్షన్, తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు శుక్రవారం నాడు నాంపల్లి లోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ మండల, నియోజకవర్గ స్థాయిలో పని చేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మంచిని మంచిగా, నిజాన్ని నిర్భయంగా సమాజనికి తెలియజేసే దాంట్లో ఎంతో మంది జర్నలిస్టులు ఆణిముత్యాలుగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. జర్నలిస్టు వృత్తిని నమ్ముకుని తన జీవితం మొత్తం ఆ వృత్తికే అంకితం అయినవాళ్ళు ఎంతోమంది ఉన్నారని అన్నారు. ఆనాటి ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనాన్ని చిన్న చిన్న మరమత్తులు పూర్తి చేసుకుని ఈ నెల చివరిలోగా ప్రారంభిస్తామని తెలిపారు. విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42.00 కోట్లను ఫీక్సడ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమి ఖర్చు పెడుతుందని. జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్డ్ డిపాజిట్ పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు రూ.22 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ .1,00,000/తో పాటు అయిదు సంవత్సరాల వరకు, నెలకు రూ.3000/ ల చొప్పున పెన్షన్, వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల క్రింద 1 నుండి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు నెలకు 1,000/ల చొప్పున గరిష్టంగా ఇద్దరికి అందించడం జరుగుతుంది. ఇప్పటి వరకు ఈ ఖాతాలో మొత్తం రూ.8,98,39,000/లు ఆర్థిక సహాయం అందించండం జరిగిందన్నారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి మాట్లాడుతూ ఈ సమాజంలో జర్నలిస్టు వృత్తి అత్యంత కీలకమైనదని తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్నారని గడిచిన రెండు రోజులుగా రెండు దేశాల మధ్య ఏం జరుగుతుందో అన్న ఆతృతతో ఎదురుచూస్తున్న ప్రజలకు తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నారని కొనియాడారు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పాక్ మళ్లీ పునరావృత దాడులు డ్రోన్లు, క్షిపణులతో నిష్ఠూర ప్రయత్నం

- 26కుపైగా ప్రాంతాలపై క్షిపణి, డ్రోన్ దాడులు – సైన్యం ధీటైన ప్రతీకారం..
- శ్రీనగర్ నుంచి జోద్‌పూర్ దాకా బ్లాకౌట్ – చీకట్లో భద్రతా చర్యలు
- పాక్ కాల్పుల్లో మహిళ మృతి – 18 మందికి గాయాలు
- మోదీ సమీక్ష, సైన్యం అప్రమత్తం – టెరిటోరియల్ ఆర్మీ విధుల్లోకి?



(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)

దాయాది బుద్ధి మారలేదు. తొలిరోజు భారత్‌పై విరుచుకుపడేందుకు విఫలయత్నం చేసి చావుదెబ్బ తిన్న పాకిస్తాన్.. రెండోరోజూ సరిహద్దు ప్రాంతాలపై దాడులకు ప్రయత్నించింది. శుక్రవారం చీకట్లు పడుతూనే జమ్మూకశ్మీర్ మొదలు రాజస్తాన్ దాకా 26కుపైగా ప్రాంతాలపైకి క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. అయితే ఈ దాడులను సైన్యం దీటుగా తిప్పికొడుతోంది. వాటిని ఎక్కడివక్కడ కూల్చేస్తోంది. ఉద్రిక్తతల నేపథ్యంలో ముందుజాగ్రత్తగా బ్లాకౌట్ కొనసాగుతుండటంతో ఆయా రాష్ట్రాల్లో శ్రీనగర్ మొదలుకుని జోద్‌పూర్ దాకా పలు పట్టణాల్లో చీకట్లు కమ్ముకున్నాయి. ఓవైపు దాడులకు తెగబడుతూనే, మరోవైపు భారత్‌తో ఉద్రిక్తతలను తగ్గించాలంటూ ఇరాన్, సౌదీ, ఇతర గల్ఫ్ దేశాలను పాక్ ప్రాధేయపడుతోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని మోదీ.. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, త్రివిధ దళాధిపతులతో శుక్రవారం రాత్రి సమీక్షించారు.

సరిహద్దు ప్రాంతాలపై పాక్ దాడులు వరుసగా రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగాయి. చీకట్లు పడుతూనే జమ్మూ కశ్మీర్ మొదలుకుని రాజస్తాన్ దాకా 26కు పైగా ప్రాంతాల్లో దాయాది మరోసారి క్షిపణి, డ్రోన్ దాడులకు దిగింది. జమ్మూ కశ్మీర్‌లోని ఉరి, సాంబా, నౌగావ్, పూంచ్, జమ్మూ, ఉధంపూర్, నగ్రోటా, రాజౌరీ, పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, అమృత్‌సర్, రాజస్తాన్‌లోని జైసల్మేర్, పోఖ్రాన్ తదితర ప్రాంతాలు వీటిలో ఉన్నాయి. అక్కడి పౌర ఆవాసాలతో పాటు సైనిక స్థావరాలను పాక్ డ్రోన్లు లక్ష్యంగా చేసుకున్నాయి.

దాడులను సైన్యం దీటుగా తిప్పికొడుతోంది. వాటిని ఎక్కడివక్కడ కూల్చేస్తోంది. ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాలన్నింటా అప్రమత్తత పాటిస్తున్నారు. ముందు జాగ్రత్తగా బ్లాకౌట్ కొనసాగుతుండటంతో ఆయా రాష్ట్రాల్లో శ్రీనగర్ మొదలుకుని జోద్‌పూర్ దాకా పలు పట్టణాల్లో చీకట్లు కమ్ముకున్నాయి. మరోవైపు సరిహద్దుల పొడవునా పాక్ భారీగా కాల్పులకు తెగబడుతోంది. జమ్మూలోని రాంగఢ్, సుచేత్‌గఢ్ మొదలుకుని రాజస్తాన్‌లోని గంగానగర్ దాకా పలు ప్రాంతాలు కాల్పుల మోతతో దద్దరిల్లిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పలు సరిహద్దు జిల్లాలకు రెడ్ అలర్టులు జారీ చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ అత్యున్నత స్థాయి సమావేశంలో పరిస్థితిని సమీక్షించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్‌తో పాటు త్రివిధ దళాధిపతులు భేటీలో పాల్గొన్నారు. భావి కార్యాచరణపై లోతుగా చర్చించారు. అనంతరం విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, ఆ శాఖ కార్యదర్శి మిస్రీ, దోవల్‌తో కూడా మోదీ గంటన్నరకు పైగా భేటీ అయ్యారు. అంతకుముందు త్రివిధ దళాల మాజీ అధిపతులు, ఉన్నతాధికారులతో కూడా ఆయన సమావేశమై పరిస్థితిపై చర్చించారు. మరోవైపు కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా సరిహద్దుల వెంబడి పరిస్థితిపై కూలంకషంగా సమీక్ష జరిపారు.

అవసరమైతే టెరిటోరియల్ ఆర్మీని కూడా పూర్తిస్థాయిలో విధుల్లో నియోగించాల్సిందిగా ఆర్మీ చీఫ్‌ను కేంద్రం ఆదేశించింది. శత్రువుకు మర్చిపోలేని రీతిలో బుద్ధి చెప్పాలని సైన్యాన్ని రాజ్‌నాథ్ ఆదేశించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలంటూ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్ర అగ్నిమాపక సేవలు, పౌర రక్షణ విభాగాల డీజీ వివేక్ శ్రీవాత్సవ సర్క్యులర్ పంపారు. దేశవ్యాప్తంగా వైద్య సిబ్బందికి సెలవులను కూడా రద్దు చేశారు. ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దుల్లోని పలు విమానాశ్రయాల మూసివేతను మే 15 దాకా పొడిగించాలని కేంద్రం నిర్ణయించింది.

శుక్రవారం అర్ధరాత్రి దాకా సరిహద్దుల పొడవునా పదులకొద్దీ పాక్ డ్రోన్లను సైన్యం కూల్చేసింది. మంటల్లో కాలుతూ కూలిపోతున్న డ్రోన్లతో ఆకాశం ప్రకాశమానంగా మారింది. అంతకుముందు శ్రీనగర్ విమానాశ్రయం, దక్షిణ కశ్మీర్‌లోని అవంతిపురా వైమానిక బేస్‌పై డ్రోన్ దాడులకు పాక్ చేసిన ప్రయత్నాలను తిప్పికొట్టింది. అంతకుముందు జమ్మూతో పాటు పలు ఇతర ప్రాంతాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. సైరన్లు మోగాయి.

పాక్ కాల్పులకు ఒక మహిళ బలవగా 18 మందికి పైగా గాయపడ్డారు. లైట్లు ఆర్పేయాల్సిందిగా స్థానిక మసీదుల్లోని లౌడ్‌స్పీకర్ల ద్వారా ప్రజలకు అధికారులు విజ్ఞప్తి చేశారు. తన చుట్టుపక్కల ప్రాంతాలన్నీ బాంబులు, కాల్పుల మోతతో దద్దరిల్లిపోతున్నాయంటూ జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బారాముల్లా, కుప్వారా, బందీపురా వంటి సరిహద్దు జిల్లాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలు, బంకర్లకు తరలిస్తున్నారు. దాడులు తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో సరిహద్దుల వెంబడి మరిన్ని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను సైన్యం యుద్ధ ప్రాతిపదికన మోహరిస్తోంది. ఓవైపు దాడులకు తెగబడుతూనే, మరోవైపు భారత్‌తో ఉద్రిక్తతలను తగ్గించాలంటూ ఇరాన్, సౌదీ అరేబియా, ఇతర గల్ఫ్ దేశాలను పాక్ ప్రాధేయపడుతోంది. పాక్‌తో యుద్ధ పరిస్థితి నెలకొని ఉందని అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా అభిప్రాయపడ్డారు.

# భద్రతా వ్యూహంపై ప్రధాని మోదీ కీలక సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)



సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితిని, ముఖ్యంగా పాకిస్తాన్ వైపు నుండి జరుగుతున్న కార్యకలాపాలను చర్చించడం ఈ సమావేశం ప్రధాన లక్ష్యం. ఈ క్రమంలోనే దేశ రక్షణ విధానాన్ని మరింత బలోపేతం చేయడానికి సూచనలు చేశారు.

ఈ సమావేశంలో, ప్రధానమంత్రి ప్రస్తుత పరిస్థితిని సమీక్షించడమే కాకుండా, దేశ రక్షణ విధానాన్ని మరింత బలోపేతం చేయడానికి అనుభవజ్ఞులైన సైనిక అధికారుల నుండి సూచనలను కూడా తీసుకున్నారు. ఇందులో మాజీ ఆర్మీ చీఫ్, మాజీ ఎయిర్ ఫోర్స్ చీఫ్, మాజీ నేవీ చీఫ్ పాల్గొన్నారు. ప్రధానమంత్రి మోదీ సీనియర్ అధికారులందరికీ వారి అనుభవం దేశానికి అమూల్యమైన ఆస్తి అని, దేశం బహుముఖ భద్రతా సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత కాలంలో వారి పాత్ర మరింత ముఖ్యమైనదిగా మారుతుందని అన్నారు. అధికారులందరూ తమ వ్యూహాత్మక సలహాల, అనుభవం ద్వారా దేశాన్ని సురక్షితంగా ఉంచడంలో ప్రభుత్వానికి సహాయం చేయాలని ఆయన కోరారు.

భారతదేశం, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్న సమయంలో ఈ సమావేశం జరిగింది. ఇటీవలి కాలంలో, పాకిస్తాన్ వైపు నుండి నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వద్ద నిరంతరం కాల్పులు జరుగుతున్నాయి. ముఖ్యంగా జమ్మూ కాశ్మీర్ సరిహద్దు ప్రాంతాలైన ఉరి, పూంచ్, కుప్వారాలలో పాకిస్తాన్ సైన్యం భారీ ఆయుధాలతో దాడి చేయడానికి ప్రయత్నించింది. దీనికి భారత సైన్యం గట్టి సమాధానం ఇచ్చింది. ప్రతీకార చర్యలో పాకిస్తాన్ కూడా భారీ నష్టాలను చవిచూసింది.

అంతకుముందు, ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తుత ఆర్మీ చీఫ్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) లతో సమావేశం నిర్వహించారు. పాకిస్థాన్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు ప్రధానమంత్రి కీలక సూచనలు చేసినట్లు సమాచారం.

ఇక ఇవాళ భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత సైన్యం నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో, పాకిస్తాన్ అర్ధరాత్రి భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రయత్నించిందని వెల్లడించారు. ఈ దాడికి భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' అని పేరు పెట్టింది. పాకిస్థాన్‌కు తగిన సమాధానం ఇవ్వడం జరుగుతోంది. పాకిస్తాన్ నియంత్రణ రేఖ వద్ద ఫిరంగులు, భారీ ఆయుధాలను ఉపయోగించి దాడులకు పాల్పడుతోంది. అయితే భారత సైన్యం పూర్తిగా సిద్ధంగా ఉందని,ప్రతి దాడికి తగిన సమాధానం ఇవ్వడం జరుగుతుందని భారత ఆర్మీ స్పష్టం చేసింది. సరిహద్దుల్లో పరిస్థితిపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఉంద మరియు ఏదైనా పరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రతి స్థాయిలో సన్నాహాలు జరుగుతున్నాయని కూడా స్పష్టమైంది. రాబోయే రోజుల్లో భారతదేశ భద్రతా విధానంలో ఎలాంటి ముఖ్యమైన మార్పులు వస్తాయో ఇప్పుడు చూడాలి.

# క్వెట్టాపై బలూచ్ యోధుల ఆధిపత్యం

## పాకిస్థాన్‌పై ద్విముఖ దాడులు, భారత్‌కు బలూచీ రేడియో మద్దతు

(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)



భారతదేశం, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. భారత్ తాజాగా ఇస్లామాబాద్, రావల్పిండి సహా పాకిస్థాన్‌లోని అనేక ప్రాంతాలపై దాడులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల నేపథ్యంలో బలూచిస్థాన్ నుంచి కీలకమైన సమాచారం వెలుగులోకి వచ్చింది. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ప్రకటించిన ప్రకారం, వారు పాకిస్థాన్ సైన్యాన్ని తరిమికొట్టి, క్వెట్టా నగరాన్ని వారి ఆధీనంలోకి తీసుకున్నట్టు తెలిపారు. ఇదే సమయంలో, పాకిస్థాన్ ఇటీవల భారత్‌లోని అనేక నగరాలపై దాడులు చేయగా, వాటిని భారత భద్రతా బలగాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయి. భారత దళాలతో పాకిస్థాన్ సైన్యం యుద్ధం చేస్తున్నసమయంలోనే, బలూచ్ యోధులు క్వెట్టా ప్రాంతంలో చర్యలకు పాల్పడ్డారు. కెప్టెన్ సఫర్ ఖాన్ చెక్ పోస్ట్‌ను బలూచ యోధుల లక్ష్యం క్వెట్టాలో ఉన్న ఫ్రాంటియర్ కార్ప్స్ ప్రధాన కార్యాలయంపై బలూచ్ యోధులు ముట్టడి చేశారు. తాజా వివరాల ప్రకారం, తిరుగుబాటుదారులు క్వెట్టా నగరంపై పూర్తి నియంత్రణ సాధించారని, అక్కడ ఉన్న పాక్ సైనికులను అక్కడి నుంచి తరిమివేశారని తెలుస్తోంది.క్వెట్టాలోని జంగ్లే బాగ్ ప్రాంతంలోని కాంబ్రానీ రోడ్డులో ఉన్న కెప్టెన్ సఫర్ ఖాన్ చెక్ పోస్ట్‌ను బలూచ్ యోధులు లక్ష్యంగా చేసుకున్నారు.అదే సమయంలో సమీపంలోని ఆరు ప్రాంతాల్లో పేలుళ్లను జరిపారు. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఈ విధ్వంసకర చర్యలకు పాల్పడింది. జమరాన్ కట్గాన్ ప్రాంతంలోని పాకిస్థాన్ ఆక్రమణ దళాల చెక్‌పాయింట్‌పై ఆటోమేటిక్ తుపాకులు, లాంచర్లు,బహుళ గ్రెనేడ్లతో ఘాటుగా దాడి చేశారు. ఈ దాడుల్లో వారి లక్ష్యాలను సమర్థవంతంగా చేధించగలిగారు. బలూచీ రేడియో భారత్‌కు మద్దతు...


ఇక పాకిస్థాన్‌లోని చమురు క్షేత్రాలను కూడా బలూచ్ యోధులు లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారు.ఈ దాడుల వలన అనేకమంది పాకిస్థాన్ సైనికులు, అలాగే కొంతమంది సాధారణ పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం.ఈ దాడుల అనంతరం, పాకిస్థాన్ సైన్యం క్వెట్టా ప్రాంతం నుంచి వెనక్కు వెళ్లినట్టు తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా, భారత్ పాకిస్థాన్‌పై నిర్వహిస్తున్న దాడుల విషయాన్ని బలూచీ రేడియో ప్రత్యేకంగా హైలైట్ చేస్తోంది. అంతేకాకుండా, బలూచీ రేడియో భారత్‌కు మద్దతు కూడా ప్రకటిస్తోంది.

# నేడు కన్నుల పండువగా మిస్ వరల్డ్ 2025 ప్రారంభ ఉత్సవాలు

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)



సంస్కృతి, సౌందర్యం రెండిరటి మేళవింపుగా నిర్వహించనున్న మిస్ వరల్డ్ ౹2025 ఉత్సవాలను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అధికారులు ఈ పోటీల్లో తెలంగాణ సంస్కృతి, కళలు, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా చక్కని కార్యక్రమాలను అధికారులు ఏర్పాటు చేయనున్నారు.తెలంగాణాకు చెందిన వివిధ రకాల జానపద, గిరిజన, శాస్త్రీయ కళలు, హైదరాబాది దక్కని కళారూపాలను ఈ ఉత్సవాలలో సమ్మిళితం చేసి ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ ఖ్యాతి ని, సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ప్రపంచ దేశాల నుంచి హైదరాబాద్ నగరానికి విచ్చేసే సుందరీమణుల ఆహ్వానం కోసం రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో ఈనెల 3వ తారీఖు నుంచి 9వ తారీఖు వరకు కూచిపూడి, భరతనాట్యం, పేరిణి, కథక్, డప్పులు, బాజాభజంత్రీలు, మంగళ వాయిద్యాల తో కూడిన బృందాలతో స్వాగతం పలికేలా ఏర్పాటు చేయడం జరిగింది. 24 గంటల పాటు అందుబాటులో ఉండి ఈ కళాకారులు ఎయిర్పోర్టులో ప్రపంచ సుందరి పోటీలకు విచ్చేస్తున్న సుందరీమణులకు స్వాగతం పలకడం జరిగింది. వారందరూ తెలంగాణ నేల మీద, హైదరాబాదులో కాలిడగానే కుంకుమ తిలకం దిద్ది, హారతులతో వారికి స్వాగతం పలకడం జరిగింది. శనివారం ( మే 10వ తారీకున) గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అత్యంత వైభవంగా జరుగుతున్న ప్రపంచ సుందరి ప్రారంభోత్సవ వేడుకలలో తెలంగాణ సంస్కృతి, కళలు ఆకట్టుకునేలా రూపొందించడం జరిగింది. వాటిలో మొదట తెలంగాణ రాష్ట్ర గీతం ఆలాపనతో ప్రారంభం అవుతాయి. లోక కవి డాక్టర్ అందెశ్రీ గారు రచించిన ఈ గీతానికి, ఆస్కార్ పురస్కార గ్రహీత ఎం.ఎం.కీరవాణి గారు సంగీతాన్ని సమకూర్చగా, ఈ పాటని ఈ ప్రపంచ సుందరి వేడుకలలో ప్రముఖ గాయకుడు, శిక్షకుడు శ్రీ కొమాండూరి రామాచారి గారి శిష్య బృందం 50 మంది బృంద గీతంగా ఆలపిస్తారు. ఆ తర్వాత కాకతీయుల కాలం నుండి తెలంగాణ శాస్త్రీయ నృత్య రీతిగా ఖ్యాతి గడించిన పేరిణి నాట్య ప్రదర్శన అత్యంత వైభవంగా జరగనుంది. 250 మంది మహిళా కళాకారిణులు పేరిణి లాస్య సంప్రదాయాన్ని అనుసరించి ఈ నృత్యాన్ని ప్రదర్శించబోతున్నారు. దీనికి శ్రీ పేరిణి సందీప్ నృత్య దర్శకత్వం వహించగా, ప్రముఖ సంగీత నిపుణుడు ఫణి నారాయణ గారు స్వరాలు సమకూర్చడం జరిగింది. దాదాపు పది నిమిషాల పాటు జరిగే ఈ పేరిణి నాట్యం లో సౌందర్యం, సంస్కృతి, స్త్రీల సాధికారత అంశాలు ప్రధానంగా ఉదహరించడం జరిగింది. దాంతోపాటు కళాకారులు అందరూ కలిసి నక్షత్రం ఆకారం లో, సీతాకోకచిలుక ఆకారాన్ని, అలాగే మిస్ వరల్డ్ లోగో ఆకృతిని కూడా తమ విన్యాసాల లో భాగంగా ప్రదర్శిస్తారు. ఆ తర్వాత ప్రపంచ దేశాల నుంచి విచ్చేసిన సుందరీమణుల పరిచయ కార్యక్రమానికి ప్రారంభ సూచికగా, ఖండాల వారీగా తెలంగాణ జానపద, గిరిజన కళారూపాల ప్రదర్శనలతో ప్రారంభమవుతాయి. వాటిలో భద్రాచలం గోదావరి పరివాహక ప్రాంతానికి పట్టుగొమ్మగా నిలిచిన కొమ్ము కోయ కళాకారులు శ్రీ రామకృష్ణ బృందం ప్రదర్శన ఉంటుంది. ఆ తర్వాత ఆదిలాబాద్ ప్రాంతం నుంచి గోండు జాతి ప్రజల విశిష్ట కళారూపం గుస్సాడీ కళా ప్రదర్శన శ్రీ కత్లే శ్రీధర్ బృందంతో మరొక ఖండానికి సంబంధించిన సుందరీమణులు వేదిక కి పరిచయం అవుతారు. అలాగే తెలంగాణ జానపద సంప్రదాయానికి నిలువెత్తు నిర్వచనంగా నిలిచే డప్పులు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత శ్రీ అందే భాస్కర్ బృందంతో, తెలంగాణ గిరిజన వైభవానికి ప్రతీకగా నిలిచే బంజారా మహిళల విన్యాసాలు శ్రీమతి స్వప్న బృందంతో ప్రదర్శనకి వస్తాయి. ఆ తర్వాత తెలంగాణ గ్రామీణ పల్లె జీవన ప్రతీకగా నిలిచిన ఒగ్గుడోలు కళా విన్యాసాలు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత శ్రీ చౌదరపల్లి రవి కుమార్ బృందంచే ప్రదర్శితమవుతోంది. ఈ కళారూపాలు అన్నింటి మేళవింపుగా ముగింపు ఉంటుంది. ఇలా సౌందర్యం, సంస్కృతి రెండు కలగలిసిన వేడుకగా ఈ ప్రారంభోత్సవ సంబరాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించింది.



# తెలంగాణ సిఐసిగా డా. జీ.చంద్రశేఖర్ రెడ్డి పదవి ప్రమాణ స్వీకారం

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)



తెలంగాణరాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ గా డా. జి చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 12.05 గంటలకు పదవి బాధ్యతలు స్వీకరించారు. రాజ్ భవన్ దర్బార్ హాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జి.చంద్రశేఖర్ రెడ్డిచే రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణ రావు,...., శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, రాష్ట్ర రైతు కమీషన్ చైర్మన్ కోదండ రెడ్డి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, డీజీపీ జితేందర్, రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుమిదిని, విజిలెన్స్ కమీషనర్ ఏం.జీ.గోపాల్, సీ.ఏం.ఓ. అధికారులు శేషాద్రి, శ్రీనివాస రాజు, మాణిక్ రాజ్,శ్రీనివాసులు, రాజ్ భవన్ కార్యదర్శి దాన కిషోర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మహేష్ దత్ ఎక్కా, సీనియర్ ఐఏఎస్ అధికారులు రఘునందన్ రావు, బుద్ధ ప్రకాష్, వినయ్ కృష్ణా రెడ్డి, అడిషనల్ ద మహేష్ భగవత్ తదితరులు హాజరయ్యారు. డా. చంద్ర శేఖర్ రెడ్డి ఈ పదవిలో మూడు సంవత్సరాలపాటు లేదా 65 ఏళ్ల వరకు ఉంటారు.



# జవాన్ మురళి నాయక్ మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

జమ్మూకశ్మీర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదుల కాల్పుల్లో జవాన్ మురళి నాయక్ వీర మరణం పొందారు. జవాన్ మృతిపై పలువురు నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. భారత ఆర్మీకి మురళి నాయక్ చేసిన సేవలను కొనియాడుతున్నారు. మురళి నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెబుతున్నారు. జవాన్ మురళి నాయక్ మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. జమ్మూకశ్మీర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదుల కాల్పుల్లో జవాన్ మురళి నాయక్ వీర మరణం పొందడం దిగ్భ్రాంతి కలిగించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జవాన్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఇవాళ (శుక్రవారం) సీఎం రేవంత్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు.

# మురళి నాయక్ త్యాగం చరిత్రలో నిలిచిపోతుంది: బండి సంజయ్

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)



పాకిస్తాన్‌తో పోరాటంలో జవాన్ మురళి నాయక్ మృతి పట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మురళి నాయక్ వీరమరణాన్ని యావత్ భారతదేశం గుర్తుంచుకుంటుందని బండి సంజయ్ తెలిపారు. దేశం కోసం మురళీనాయక్ చేసిన త్యాగం వెలకట్టలేనిదని అన్నారు. మురళి నాయక్ త్యాగం చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. మురళి నాయక్ తండ్రి శ్రీరామ్ నాయక్‌తో ఫోన్‌లో మాట్లాడి బండి సంజయ్ ఓదార్చారు. మురళి నాయక్ తండ్రితో మాట్లాడి ఆయనకు ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ మేరకు ఇవాళ (శుక్రవారం) బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. కాగా.. భారతదేశం పాకిస్తాన్ దేశాల మధ్య జరుగుతున్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తెలుగు జవన్ మురళి నాయక్ అమరులయ్యారు. శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన మురళి నాయక్ గత కొన్నేళ్లుగా భారత సైన్యంలో విధులు నిర్వర్తిస్తున్నారు. నిన్న(గురువారం) రాత్రి యుద్ధభూమిలో జవాన్ మురళి నాయక్ వీరమరణం పొందారు. ఈ విషయం తెలుసుకున్న జవన్ కుటుంబ సభ్యులు తీవ్ర శోక సంద్రంలో మునిగిపోయారు. అయితే రేపు (శనివారం) జవన్ మురళి నాయక్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు ఆర్మీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే మురళి నాయక్ మృతిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు పలువురు నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించాలి



- మీడియా అకాడమీ చైర్మన్ కు వనపర్తి టియుడబ్ల్యూజే (ఐజేయు) నాయకుల వినతి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ మీడియా ఆకాడమి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విలువలతో కూడిన జర్నలిజం వైపు అడుగులు వేసేందుకు జర్నలిస్టులకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగ పడతాయని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో వనపర్తి జిల్లాలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జే (ఐజేయు) వనపర్తి జిల్లా నాయకులు బి. రాజు, విజయ్, రవికాంత్, మన్యం, వేముల తిరుపతయ్య,సూరం పల్లి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# దంత వైద్యశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

గోపాల్పేట మండల కేంద్రంలో దంత వైద్యులు జోషిరావు, స్వర్ణ దీపిక లు నూతనంగా ఏర్పాటు చేసిన దంత వైద్యశాలను శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రాలలో ఏర్పాటు చేసే ఇలాంటి వైద్యశాల వలన గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవా దృక్పథంతో వైద్యం అందించాలని ఆయన వైద్యులకు సూచించారు. ఉన్నత చదువులు చదివి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చిన వైద్య దంపతులను ఇద్దరిని ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో గోపాల్పేట ఉమ్మడి మండలం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ సత్యశీలారెడ్డి, గోపాల్పేట మండల కేంద్ర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివన్న, కొంకి వెంకటేష్ ,పెద్దమందడి మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, పెబ్బేరు మాజీ ఎంపీపీ కురుమూర్తి,గంధం ఆంజనేయులు ,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు రసాయన ఎరువులను తక్కువ మోతాదులో వాడాలి

- వ్యవసాయ శాస్త్రవేత్త రమాదేవి.

**మెదక్ బ్యూరో తెలంగాణ ముచ్చట్లు,**

మెదక్ రైతులు తమ వ్యవసాయ భూముల్లో వేసే పంటలకు తక్కువ మోతాదులో రసాయ ఎరువులను వాడాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రమాదేవి అన్నారు. శుక్రవారం మిరుదొడ్డి టౌన్‌లో రైతులకు సాగు పద్ధతుల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాన కాలంలో రైతులు కొనుగోలు చేసిన వివిధ రకాల విత్తనాలకు వెంటనే రశీదులను పొందాలని సూచించారు.
వరి పంటతో పాటు ప్రత్యామ్నాయ పంటల పై రైతులు దృష్టిని సారించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలతో దిగుబడులలో కూడా గణనీయమైన మార్పు ఉంటుందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందే అవకాశం ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో ఏవో బోనాల మల్లేశం, ఏఈవో రేఖ, రైతులు తదితరులు పాల్గొన్నారు.





# అమరులైన సైనికులకు కొవ్వొత్తులతో నివాళి

- అమరులైన సైనికుల త్యాగం మరువలేనిది
- పామిరెడ్డి పల్లి గ్రామస్తులు

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పాక్ దాడిలో అమరులైన సైనికులకు సంఘీభావంగా కొవ్వొత్తులతో పామిరెడ్డి పల్లి గ్రామస్తులు నివాళి అర్పించారు. శుక్రవారం పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామస్తులు చౌరస్తాలో కొవ్వొత్తులు వెలిగించి పాక్ ఉగ్రవాద దాడిలో వీర మరణం పొందిన సైనికులకు మౌనం పాటించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... దేశం కోసం ప్రాణాలర్పించిన అమరులైన సైనికుల త్యాగం దేశ ప్రజలు ఎన్నటికీ మరువలేనిదని అన్నారు. దేశ రక్షణలో అమరులైన సైనిక కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# భారత సైన్యానికి సంఘీభావం

- త్రివిధ దళాలకు అభినందనలు
- వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



ప్రపంచ శాంతికి విగాథంగా మారిన ఉగ్రవాదాన్ని కూకట వేళ్ళతో పెకిలించడమే భారత్ లక్ష్యం అని పెద్దమందడి మండలం వెల్టూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి (బంగ్లా బాబు) అన్నారు. గురువారం ఉదయం పాకిస్తాన్ లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేయడంతో దేశంలోని ప్రజలందరూ సంబరాలు చేసుకుంటున్నారని అలాగే త్రివిధ దళాలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భారత సైన్యం సింధూర్ పేరిట పాకిస్తాన్, పిఓకే ప్రాంతంలోని ఉగ్రవాద శిబిరాలపై జరిపిన ప్రతీకార దాడిని స్వాగతి చేస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. భారత సైనికులు చూపిన ధైర్యం, దేశంలోని ప్రతి పౌరుడికి గర్వకారణంగా ఉందని, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న దాన్ని రాజకీయాలకు అతీతంగా ప్రతిఘటించాలని, పెహల్గాం పై దాడికి పాకిస్తాన్ కు భారత సైన్యం సరైన సమాధానం చెప్పిందన్నారు. ఉగ్రమూకలపై రుద్రతాండం చేయడంతో భారత్ సత్తా మరోసారి నిరూపణ జరిగిందన్నారు. పాకిస్తాన్ లోని ప్రజలకు ఎటువంటి హాని జరగకుండా కేవలం ఉగ్రవాదులను లక్ష్యంగా దాడులు చేశారని హర్షం వ్యక్తం చేశారు. దేశమంతా ఏకతాటిపై నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. భారత్ సైన్యం నిర్వహించిన ఆపరేషన్ ను కేంద్ర మంత్రివర్గం తో పాటు, యావత్ భారత్ జాతి గుర్తు చేశారు. పహాల్గాం దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్ లోని ఉగ్ర స్తావారాలపై సైన్యం మెరుపు దాడులు నిర్వహించడం ద్వారా భారత్ గట్టి హెచ్చరికలు జారీ చేసిందని అభిప్రాయపడ్డారు. దేశ ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, భారత సైన్యం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దేశ రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు మద్దతు ఇవ్వవలసిన అవసరం ఉందని ఆర్.జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

# బీరప్ప పండుగకు ఎమ్మెల్యేను ఆహ్వానించిన యాదవ సోదరులు

**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:**


పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామంలో ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ ఆదివారం వరకు నిర్వహించే బీరప్ప పండగలలో పాల్గొనాలని గ్రామ యాదవ సోదరులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ని శుక్రవారం ప్రత్యేకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందిస్తూ ఆహ్వానించారు.ఇందుకు సానుకూలంగా స్పందించిన గౌరవ ఎమ్మెల్యే ఆదివారం తప్పకుండా హాజరవుతారని తెలిపారు.ఆహ్వానం పలికిన వారిలో కాంగ్రెస్ పార్టీ మాజీ వార్డు సభ్యులు భిరయ్య, పండగల నిర్వహణ కమిటీ సభ్యులు ఆవుల శ్రీశైలం, అవుల వెంకటేష్, కొండన్న తదితరులు పాల్గొన్నారు.



# ఏ టైంలో స్నానం చేస్తే మేలు..

మంచి ఆరోగ్యానికి స్నానం చాలా అవసరం. స్నానం శరీరాన్ని శుభ్రపరచడమే కాకుండా మనసును కూడా ప్రశాంతపరుస్తుంది. కానీ చాలా మంది ఉదయం స్నానం చేస్తారు. మరి కొంతమంది రాత్రిపూట స్నానం చేస్తారు. భారతీయులుగా మనం ఎక్కువగా ఉదయం స్నానం చేయడానికి ఇష్టపడతాం. ప్రతి ఒక్కరికీ ప్రతిరోజూ స్నానం చేసే అలవాటు ఉంటుంది. మంచి ఆరోగ్యానికి స్నానం చాలా అవసరం. స్నానం శరీరాన్ని శుభ్రపరచడమే కాకుండా మనసును కూడా ప్రశాంతపరుస్తుంది. కానీ చాలా మంది ఉదయం స్నానం చేస్తారు. మరి కొంతమంది రాత్రిపూట స్నానం చేస్తారు. భారతీయులుగా మనం ఎక్కువగా ఉదయం స్నానం చేయడానికి ఇష్టపడతాం. కానీ చైనా, జపాన్, కొరియా వంటి దేశాల్లో రాత్రిపూట స్నానాలు చేసే అలవాటు ఉంది. కానీ ఈ రెండిరటిలో ఏది మంచిదో మీరు ఎప్పుడైనా ఆలోచించారా? సాధారణంగా చాలా మంది సాయంత్రం లేదా రాత్రి పూట స్నానం చేస్తారు. ఇలా చేయడం వల్ల రోజులో శరీరంపై పేరుకుపోయిన టాక్సిన్స్, మురికి పూర్తిగా తొలగిపోతాయి. అలాగే, వారికి రాత్రిపూట విశ్రాంతి అవసరం కాబట్టి, బాగా నిద్రపోవడానికి ఇలా చేస్తారు. దీనివల్ల ఒత్తిడి తగ్గుతుందని చాలా మంది నమ్ముతారు. ముఖ్యంగా చైనా వంటి దేశం.. తేమతో కూడిన, ఉష్ణమండల ప్రాంతం. కాబట్టి ఇక్కడి ప్రజలకు ఎక్కువగా చెమట పడుతుంది. అందుకే వారు రాత్రిపూట స్నానాలు చేయడానికి ఇష్టపడతారు. రాత్రిపూట స్నానం చేయడం మంచిదని నిపుణులు కూడా చెబుతున్నారు. రోజంతా కష్టపడి పనిచేసిన తర్వాత స్నానం చేయడం వల్ల అలసట తగ్గి బాగా నిద్రపోతుందట. చాలా మంది ఉదయం, రాత్రి స్నానం చేస్తారు. ఆయుర్వేదంలో మాత్రం ఉదయం సూర్యోదయానికి ముందు, సాయంత్రం సూర్యాస్తమయానికి ముందు స్నానం చేయడం ఉత్తమమని చెబుతుంది. అలాగే ఆయుర్వేదం ప్రకారం మధ్యాహ్నం స్నానం చేయడం మంచిది కాదు. మధ్యాహ్నం స్నానం చేయడం వల్ల అనేక వ్యాధులు వస్తాయి. ఇది మయోసైటిస్ అనే వాపుకు సంబంధించిన వ్యాధిని కలిగిస్తుందట. మధ్యాహ్నం స్నానం చేయడం వల్ల వెన్నునొప్పి, మోకాళ్ల నొప్పులు, కంటి సమస్యలు కూడా వస్తాయని నిపుణులు అంటున్నారు. తిన్న తర్వాత కూడా స్నానం చేయకూడదని నిపుణులు అంటున్నారు. భోజనం తర్వాత, ఆహారాన్ని జీర్ణం చేసుకోవడానికి కడుపుకు ఎక్కువ శక్తి, సరైన శరీర ఉష్ణోగ్రత అవసరం. అంతేకాకుండా, ఆహారం జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి తిన్న తర్వాత స్నానం చేయడం మంచిది కాదు. దీనివల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. అందుకే నిపుణులు తిన్న గంట తర్వాత లేదా గంటన్నర తర్వాత మాత్రమే స్నానం చేయాలని అంటున్నారు.

# కంటి దురద ఈ వ్యాధికి సంకేతం..



వేసవి, శీతాకాలంలో పొడి గాలితోపాటు దైనందిన జీవనశైలి అలవాట్లు కంటి అసౌకర్యానికి కారణంగా చెప్పవచ్చు. కానీ ఇది కేవలం అలెర్జీల వల్ల మాత్రమే కాదు, అనేక రకాల ఆరోగ్య సమస్యలకు సంకేతం కూడా. ఇటీవలి కాలంలో కళ్ళు దురద సాధారణ సమస్యగా మారింది. వేసవి, శీతాకాలంలో పొడి గాలితోపాటు దైనందిన జీవనశైలి అలవాట్లు కంటి అసౌకర్యానికి కారణంగా చెప్పవచ్చు. కానీ ఇది కేవలం అలెర్జీల వల్ల మాత్రమే కాదు, అనేక రకాల ఆరోగ్య సమస్యలకు సంకేతం కూడా. దానికి కారణమేమిటో అర్థం చేసుకుని దానికి సరైన చికిత్స చేయడం వల్ల కళ్ళ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. కళ్ళు దురదకు కారణమేమిటి? దుమ్ము లేదా ఇతర అలెర్జీ కారకాలు కళ్ళలో దురద, ఎరుపు, నీరు కారడానికి కారణమవుతాయి. కళ్ళు తగినంత నీటిని ఉత్పత్తి చేయనప్పుడు లేదా కన్నీళ్లు చాలా త్వరగా పొడి బారినప్పుడు దురదగా మారుతాయి. స్క్రీన్‌ల ముందు ఎక్కువ సమయం గడపడం, ఎయిర్ కండిషనింగ్ ఉపయోగించడం లేదా తక్కువ తేమ ఉన్న వాతావరణంలో ఎక్కువ సమయం గడపడం వల్ల కూడా ఇది సంభవించవచ్చు. కండ్లకలక వంటి బాక్టీరియల్ లేదా వైరల్ ఇన్ఫెక్షన్లు దురద, కళ్ళు ఎర్రబడటానికి కారణమవుతాయి.కాంటాక్ట్ లెన్స్‌లను సరిగ్గా శుభ్రం చేయకపోవడం, ఎక్కువసేపు వాటిని ధరించడం వల్ల కళ్ళు దురద లేదా అసౌకర్యంగా ఉంటాయి.కాలుష్యం, పొగ లేదా ఇతర రసాయనాలు కళ్ళను చికాకు కలిగిస్తాయి. వేసవి ఎండ వేడి లేదా శీతాకాలపు చల్లని గాలి కళ్ళ చికాకు, దురదకు కారణమవుతాయి. కొన్ని మందులు కళ్ళు ఎండిపోయి దురదకు కారణమవుతాయి. బ్లెఫారిటిస్ (కనురెప్పల వాపు), తామర లేదా థైరాయిడ్ సంబంధిత సమస్యలు కూడా కళ్ళ దురదకు కారణమవుతాయి. కొన్ని సందర్భాల్లో డయాబెటిస్ లేదా ఆటో ఇమ్యూన్ వ్యాధులు కూడా కళ్ళను ప్రభావితం చేస్తాయి. కొన్నిసార్లు వేడి వస్తువులను తిన్న తర్వాత కూడా దురద, కళ్ళు ఎర్రబడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ సందర్భంలో పుష్కలంగా నీరు తాగడం, టీ కాఫీ వంటి పానీయాలు తీసుకోకపోవడం మంచిది. సమస్య తీవ్రమైతే వైద్యుడిని తప్పనిసరిగా కలవాలి.


# తహసిల్దార్‌గా శ్రీధర్ బాబు పదోన్నతి

**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:**

అడ్డాకల్ మండలంలో డిప్యూటీ తహసిల్దార్ గా పనిచేస్తున్నటువంటి 2005 గ్రూప్ 2 బ్యాచ్ కు చెందిన శ్రీధర్ బాబుకు నల్గొండ జిల్లాకు తహసిల్దారుగా ప్రమోషన్ రావడం జరిగింది... అడ్డాకుల మండలంలో ప్రజలకు అధికారులకు సమన్యాయం చేసిన సేవలకు నిస్వార్ధంగా పనిచేసినందుకు గుర్తిస్తూ.. కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకోవడం జరిగింది... సీనియారిటీ ప్రకారం ప్రమోషన్ పొందిన రెండు సంవత్సర కాలంలోపే డిప్యూటీ కలెక్టర్ గా ప్రమోషన్ వస్తుందని తహసిల్దార్ శ్రీధర్ బాబు తెలిపారు.



# మరో సామాజిక విప్లవం



చరిత్ర అన్ని వేళలా ఒకేలా ఉండదు, కాలమాన పరిస్థితులకు తగ్గట్లు మారుతూ ఉంటుంది. కారల్ మార్క్ చెప్పినట్లు చరిత్ర అంటే వర్గ పోరాటమే. 19వ శతాబ్దంలో సాంఘిక సంస్కరణ ఉద్యమం, 20 శతాబ్దంలో జాతీయ స్వాతంత్ర్య పోరాటం, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలు, ప్రస్తుతం 21వ శతాబ్దంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సరియైన ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ప్రశ్నిస్తూ జనగణనలో కులగణనకై ఉద్యమం. ఇలా ఆయా కాలాల్లో ఆయా ఉద్యమాలు సమాజంపై ప్రభావాన్ని చూపుతూ చరిత్రగా నిలిచిపోయాయి. జనగణనలో కులగణన చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. 1931 జనాభా లెక్కల నేపథ్యంలో జనగణనలో కులగణన చేయాలనే ప్రతిపాదన 1951 జనాభా లెక్కల సందర్భంగా ముందుకొచ్చినప్పటికీ కేవలం ఎస్‌సి, ఎస్‌టిల జనాభాను మాత్రమే లెక్కించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. మొదటి బిసి కమిషన్ కాక కాళేశ్వర్ కమిషన్ సందర్భంగా, రెండవ బిసి కమిషన్ మండల కమిషన్ సందర్భంగా జనగణనలో కులగణన చర్చకు వచ్చింది. అయినా కేంద్రం ప్రభుత్వం ఒప్పుకోలేదు. ఇందిరా సహాని కేసులో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో జనగణనలో కులగణన డిమాండ్ మరోసారి ముందుకొచ్చింది. జనగణనలో కులగణనకై డిమాండ్ ఎన్నిసార్లు ముందుకొచ్చినా కేంద్రం మాత్రం జనగణనలో కులగణన వల్ల దేశ ఐక్యత దెబ్బతింటుందని తోసిపుచ్చుతూ వచ్చింది. భాషా ప్రయోక్త రాష్ట్రాల విషయంలో కూడా ఈ రకమైన అభిప్రాయంతో అప్పటి నెహ్రూ ప్రభుత్వం ఉన్నప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో భాష ప్రయోక్త రాష్ట్రాలు ఏర్పాటు అయ్యాయి. 70 సంవత్సరాల భాష ప్రయోక్త రాష్ట్రాల చరిత్రలు దేశాన్ని విచ్ఛిన్నం చేయగల అనైక్యత ఎక్కడా సంభవించలేదని చెప్పవచ్చు.

అంటే ఒక విషయంపై మనలో చాలా కాలంగా గూడుకట్టుకున్న ఆలోచనలు వాస్తవం కాదని తేలిపోయింది. జనగణనలో కులగణన చేయాలనే డిమాండ్ వచ్చినప్పుడల్లా తోసిపుచ్చిన చరిత్ర కాంగ్రె పార్టీదే. అయినప్పటికీ 2011లో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యుపిఎ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, కులగణన చేయడం జనగణనలో కులగణనకు మొదటిమెట్టుగా చెప్పవచ్చు. ఎన్‌డిఎ ప్రభుత్వం జనగణనలో కులగణనను వ్యతిరేకించినప్పటికీ ప్రస్తుతం నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ పరిణామం.

అయితే ఈ ఘనత మాత్రం దేశవ్యాప్తంగా ఈ వాదాన్ని చర్చకు తెచ్చిన కాంగ్రెస్ పార్టీది, ఆయా రాష్ట్రాల్లో జనగణనలో కులగణనకై డిమాండ్ చేసిన డిఎంకె, ఎస్‌పి, ఆర్‌జెడి లాంటి ప్రాంతీయ పార్టీలది. కులగణన చేయడమే కాదు, విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో బిసిలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో చట్టం చేసిన ఘనత తెలంగాణ రాష్ట్రానిదే. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కులగణనకు డిమాండ్ చేయడం, కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా కులగణనకు వాగ్దానం చేయడం, రాష్ట్రంలో కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించడం, బిసి సంఘాల ఒత్తిడి నేపథ్యంలో కులగణన జరగడం, విద్య, ఉద్యోగ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల పెంపుకై శాసనసభ చట్టం చేస్తూ కేంద్రానికి పంపడం చకచగా జరిగిపోయాయి. 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం బిసి సంఘాలు ఢిల్లీలో 'జంతర్ మంతర్' వద్ద డిమాండ్ చేయడంతో కులగణనపై కేంద్రం ఆలోచనలో మార్పు వచ్చిందొచ్చు. కర్ణాటక, తెలంగాణ తోపాటు బీహార్ లాంటి రాష్ట్రాలు కులగణన పూర్తి చేయడం దేశంలో చాలా రాష్ట్రాల్లో కులగణనకై డిమాండ్లు వినిపించడంతో ఒక్కసారిగా కేంద్రం పునరాలోచనలోపడి ఉండవచ్చు. బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ సభలో చివరి ఉపన్యాసంలో మాట్లాడిన మాటలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ప్రభావాన్ని చూపి ఉండవచ్చు. 'ఒక వ్యక్తికి ఒక ఓటు, ఒక ఓటుకు ఒక విలువ ద్వారా 26 జనవరి 1950 నుంచి మనం రాజకీయ సమానత్వంలోకి అడుగు పెట్టబోతున్నాం. కానీ కొన్ని వందల సంవత్సరాలుగా మన దేశంలో ఉన్న ఆచార, సంప్రదాయాలు మన సమాజంలో సామాజిక, ఆర్థికంగా సమానత్వం సాధించుటకు ప్రతిబంధకాలుగా ఉన్నాయి. రానున్న ప్రభుత్వాలు ఆ ప్రతిబంధకాలను తొలగిస్తూ సామాజిక, ఆర్థిక సమానత్వానికై ప్రయత్నించాలి. సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించనినాడు పీడిత ప్రజలు ఈ రాజ్యాంగ సభ కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామిక వ్యవస్థను కుప్పకూలుస్తారు అని హెచ్చరించారు. ఈ 78 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో మెజారిటీ వర్గాలైన బిసి ప్రజలకు విద్య, ఉద్యోగ, రాజకీయ సామాజిక, ఆర్థిక రంగాల్లో సమానత్వం చేకూర లేదనే చెప్పవచ్చు. ఒక వ్యక్తి ఒక ఓటు, ఒక ఓటుకు ఒక విలువ ద్వారా రాజకీయ సమానత్వం ఉన్నట్లు కనబడిన, ఆర్థిక అసమానతలు, ఓటు హక్కును నిజాయితీగా ఉపయోగించుకోలేని పరిస్థితుల వల్ల అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం గల రాజకీయ సమానత్వం ఇప్పటికీ సాధ్యం కాలేదు. దీనికి తోడు రాత్రికి రాత్రి ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ తీసుకొచ్చిన కేంద్రంపై దేశవ్యాప్తంగా బిసిలందరూ అసంతృప్తితో ఉన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ తగ్గడం, రానున్న బీహార్, పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో జనగణనలో కులగణననే ప్రధాన ప్రచారాంశంగా ఉండడంతో కేంద్రం ఆలోచన మారి ఉండవచ్చు. సామాజిక, రాజకీయ, ఆర్థిక సమానత్వం సాధించాలంటే దేశవ్యాప్తంగా డిమాండ్‌గా వస్తున్న జనగణనలో కులగణన ఒక్కటే పరిష్కార మార్గంగా కేంద్రం భావించి ఉండవచ్చు. జనగణనలో కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతించాల్సిందే. అయితే ఇల్లు అలుకగానే పండుగా కాదన్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంబడి సంబరపడిపోకూడదు. రానున్న జనగణనలో కులగణనకై కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న మార్గదర్శకాలను బిసి సమాజం నిశితంగా గమనించాలి. జనగణనలో కులగణన చేస్తే సరిపోదు. కులగణన రిపోర్టు కనుగుణంగా మండల కమిషన్ సూచించిన 40 సిఫారసులను అమలు చేయాలి. సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, ఉద్యోగ రంగాల్లో సమానత్వం సాధించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే జనగణనలో కులగణన చేపట్టినదానికి సార్థకత చేకూరుతుంది. రాజ్యాంగ సభలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశించిన రాజకీయ, సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించబడుతుంది.


# పవన శక్తిని ఒడిసిపడదాం !

గాల్లో మండి శక్తిని ఇవ్వగల పదార్థాన్ని ఇంధనంగా నిర్వచిస్తాం. ఆది మానవుడి నుంచి నేటి వరకు బొగ్గు, వంట చెరుకు, పెట్రోల్, డిసిల్, కిరోసిన్. వంట గ్యాసు లాంటి ఘన/ద్రవ/వాయు పదార్థాలను ఇంధనాలుగా మాడుతూ వస్తున్నాం. భూమి పొరల్లోంచి తవ్వి తీసిన బొగ్గు, పెట్రోలియం లాంటి ఉత్పత్తులను శిలాజ ఇంధనాలుగా పిలుస్తున్నాం. నేడు విద్యుత్ వినియోగమే ప్రజల జీవనాధారంగా మారిన వేళ శిలాజ ఇంధనాల కొరతతో పాటు వాటి వాడకం వల్ల జరుగుతున్న పర్యావరణ విధ్వంసం వల్ల తరిగే సాంప్రదాయ పునరుత్పాదకత సాధించలేని శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గిస్తూనే తరగని, సాంప్రదాయేతర, పునరుత్పాదక శక్తి వనరుల పట్ల మానవ ఆలోచనలు వెళ్లవలసిన అగత్యం ఏర్పడిరది. నేడు పునరుత్పాదక శక్తి వనరులుగా సౌర, పవన, అలల, జియోథర్మల్, హైడ్రో, బయోమాస్ లాంటివి నిలుస్తున్నాయి. గాలులు వీచినపుడు వచ్చే పవనాలతో గాలి మరలను లేదా విండ్ మిల్‌స్‌ను అమర్చి విద్యుత్తు శక్తిగా మార్చడం అనాదిగా జరుగుతూ వస్తున్నది. నెథర్‌లాండ్స్‌లో ప్రారంభంపైన విండ్ మిల్స్ విప్లవం నేడు ప్రపంచ దేశాలన్నింటిలో ప్రవేశిస్తున్నది. పవన శక్తిని ఒడిసి పట్టే సునాయాస విండ్ మిల్స్ లేదా గాలి మరలకు విస్తృత ప్రచారం కలిపించడానికి ప్రతి ఏట 10 మే రోజున "జాతీయ విండ్ మిల్ లేదా గాలి మరల దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. పర్యావరణ హిత, గ్రీన్, క్లీన్ ఎనర్జీగా లభస్తున్న పవన శక్తిని విండ్ మిల్స్ ద్వారా గ్రామీణ, మునిసిపల్, ఇతర విభాగాల్లో విద్యుత్ లేదా ఇతర రూపాల్లో వాడడం కొనసాగుతున్నది. నాటి విండ్ మిల్‌స్‌కు సాంకేతిక సొబగులు అద్ది అత్యాధునిక విండ్ టర్బైన్‌స్‌ను కూడా రూపొందించి ముందుకు సాగడం జరుగుతోంది. సహజ పవన గమనాలకు అనుగుణంగా గతిశక్తిని గాలి మరలను అమర్చి పర్యావరణహిత, హరిత, శుద్ధ విద్యుత్తు శక్తిని ఉత్పత్తి చేయడం నేడు సర్వత్రా కనిపిస్తున్న దృశ్యాలు. భూతాపానికి గ్రీన్ హౌజ్ వాయువుల ఉద్గారకాలను తగ్గించడం, కార్బన్ ఎమిషన్స్‌ను కట్టడి చేయడం, ఖర్చు తక్కువ కావడం, మేయింటెనెన్స్ సులభం కావడం, శక్తి అవసరాలను తీర్చడం, భూభాగానికి సహకరించడం, విండ్ మిల్స్ స్థాపన సులభం కావడం, ఉద్యోగాల కల్పన జరగడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన పునరుత్పాదక పవన శక్తి ఉత్పత్తితో పాటు వాడకాన్ని కూడా ప్రోత్సహించడం నేటి అవసరంగా మారింది. గాలి మరల వాడకంతో వన్యప్రాణుల సహజత్వానికి విఘాతం కలగడం, శబ్ద కాలుష్యానికి కారణం కావడం, ఎత్తైన ప్రదేశాల్లో భూమి అనుకూలంగా ఉండడం లాంటి ప్రతికూలాలు ఉన్నప్పటికీ పనవ శక్తిని విద్యుత్ రూపంలోకి మార్చడం విధిగా జరగాలి. ప్రపంచవ్యాప్తంగా 80 శాతం అత్యధిక పవనశక్తిని ఉత్పత్తి చేస్తున్న ఐదు దేశాల్లో జర్మనీ, అమెరికా, డెన్మార్క్, స్పెయిన్, భారత్ ఉన్నాయి. భారత్‌లో పవనశక్తిని అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రాల జాబితాలో ఏపి, గుజరాత్, కర్నాటక, ఎంపీ, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడులు ముందున్నాయి. భారత పునరుత్పాదక శక్తి వనరుల మంత్రిత్వశాఖ లక్ష్యాల ప్రకారం 2030 నాటికి 30 జిడబ్ల్యూ పవన శక్తిని ఒడిసి పట్టడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. విండ్ టర్బైన్స్ ద్వారా పవనంలో దాగిన గతి శక్తిని, తొలుత యాంత్రిక శక్తిగా మార్చడం, యాంత్రిక శక్తిని విద్యుత్తు శక్తిగా మార్చడం భారతంలో విస్తృతంగా జరుగుతున్నది. పర్యావరణ హిత, గ్రీన్, క్లీన్, తరగని, పునరుత్పాదక పవన శక్తిని వీడడం వల్ల ప్రత్యక్షంగా కార్బన్ ఉద్గారాలు తగ్గిపోయి ప్రతికూల వాతావరణ మార్పులు అదుపు చేయబడతాయి. సులభంగా, ఉచితంగా, విరివిగా అందుబాటులో ఉన్న పవన శక్తిని విద్యుత్‌గా మార్చడం వల్ల వ్యక్తిగత శక్తి స్వేచ్ఛ లభిస్తుంది. నేడు సోలార్ పవర్ ప్లాంట్ల వలె విండ్ పవర్‌ను వాడడం కూడా బహుళ ప్రచారంలోకి రావాలి, రేపటి పరిశుద్ధ పర్యావరణానికి పునరుద్ధరణ జరగాలి.

# పెట్రోల్, డీజిల్ సరఫరాపై క్లారిటీ ఇచ్చిన ఇండియన్ ఆయిల్!




ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, అనవసరమైన భయాందోళనలకు గురికాకుండా ఉండాలని ప్రజలను కోరింది. అలా చేయడం వల్ల కంపెనీ సజావుగా సరఫరా కార్యకలాపాలను నిర్వహించడానికి, అందరికీ అంతరాయం లేకుండా ఇంధన లభ్యతను నిర్ధారించడంలో సహాయపడుతుందని నొక్కి చెప్పింది. దేశవ్యాప్తంగా ఇంధనం, ఎల్‌పీజీ సరఫరాలు స్థిరంగా ఉన్నాయని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ శుక్రవారం ప్రజలకు తెలిపింది. ఇండియన్ ఆయిల్ దేశవ్యాప్తంగా తగినంత ఇంధన నిల్వలను కలిగి ఉందని, మా సరఫరా లైన్లు సజావుగా పనిచేస్తున్నాయని, భయపడాల్సిన అవసరం లేదని తెలిపింది. ఇంధనం, ఎల్‌పీజీ తమ అన్ని అవుట్‌లెట్లలో తక్షణమే అందుబాటులో ఉన్నాయని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, అనవసరమైన భయాందోళనలకు గురికాకుండా ఉండాలని ప్రజలను కోరింది. అలా చేయడం వల్ల కంపెనీ సజావుగా సరఫరా కార్యకలాపాలను నిర్వహించడానికి, అందరికీ అంతరాయం లేకుండా ఇంధన లభ్యతను నిర్ధారించడంలో సహాయపడుతుందని నొక్కి చెప్పింది. ప్రశాంతంగా ఉండటం, అనవసరమైన రద్దీని నివారించడం ద్వారా మీకు మెరుగ్గా సేవ చేయడంలో మాకు సహాయపడండని తెలిపింది. ఇది మా సరఫరా లైన్లను సజావుగా నడుపుతూనే ఉంటుంది. అందరికీ అంతరాయం లేకుండా ఇంధన ప్రాప్యతను నిర్ధారిస్తుందని తెలిపింది. ఈ మేరకు తన శ ఖాతాలో ఒక పోస్ట్‌లో పేర్కొంది. రెండు అణ్వాయుధ దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య, పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు ఇంధనం నిల్వ చేసుకోవడానికి పరుగెత్తడంతో పెట్రోల్ బంకుల వద్ద పొడవైన క్యూలు ఉన్నట్లు సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈ హెచ్చరిక జారీ చేశారు. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ అంతటా తొమ్మిది ప్రదేశాలలో ఉగ్రవాద మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని సమన్వయంతో క్షిపణి దాడి చేసిన ' ఆపరేషన్ సిందూర్ ' ద్వారా ఈ భయాందోళనలు చెలరేగాయి. పానిక్ బైయింగ్: బుధవారం పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాలలో ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాలలో విస్తృతంగా భయాందోళనలు నెలకొన్నట్లు నివేదించింది. ఇక్కడ నివాసితులు ఇంధనం, అవసరమైన సామాగ్రిని నిల్వ చేసుకోవడానికి పరుగెత్తారు. స్థానిక పెట్రోల్ పంప్ యజమానిని ఉటంకిస్తూ హిందూస్తాన్ టైమ్స్ నివేదిక ప్రకారం, పెరుగుతున్న ప్రజల ఆందోళన మధ్య ఇంధన అమ్మకాలు మూడు రెట్లు పెరిగాయి.



# మార్కెట్లలో ఉద్రిక్తతల భయాలు

**భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు స్టాక్ మార్కెట్లలో ఆందోళన ను రేకెత్తించాయి. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు బదులుగా పాక్ భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, క్షిపణి దాడులకు పాల్పడు తోందనే రిపోర్టులు మార్కెట్‌లలో ప్రతికూలతను పెంచాయి. మరోవైపు భారత సైన్యం దాడుల్లో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమై నట్లు రక్షణశాఖ వర్గాలు వెల్లడిరచాయి. ఈ పరిణామాలు దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాల ఒత్తిడిని పెంచాయి. ముఖ్యంగా చివరి గంటలో అమ్మకాల వెల్లువ చోటు చేసుకోవడంతో గురువారం బిఎస్ ఇ సెన్సెక్స్ 411.97 పాయింట్లు లేదా 0.51 శాతం పతనమై 80,334.81కి పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 140.60 పాయింట్లు లేదా 0.58 శాతం నష్టంతో 24,273.80 వద్ద ముగిసింది. నిఫ్టీలో మిడ్‌క్యాప్ 100 సూచీ 1.95 శాతం, స్మాల్‌క్యాప్ 1.43 శాతం చొప్పన పతనమ య్యాయి. నిఫ్టీలో ఐటి, మీడియా రంగాలు మిగితా అన్నీ ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ఆటో, ఎనర్జీ, ఎఫ్ఎంసిజి, రియాల్టీ, లోహ, ఫార్మా, ఆయిల్ అండ్‌గ్యాస్ తదితర రంగాలు 1 శాతం పైగా నష్టపోయాయి. సెన్సెక్స్30లో 26 సూచీలు నేల చూపులు చూశాయి. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సిఎల్ టెక్, కొటాక్ మహీంద్రా బ్యాంక్, టైటన్ షేర్లు స్వల్పంగా పెరిగాయి. ఎటర్నల్ (జొమాటో) 3.97 శాతం, ఎంఅండ్‌ఎం 3.36 శాతం, బజాజ్ ఫిన్ 2.19 శాతం, మారుతి సుజుకి 2.04 శాతం, టాటా స్టీల్ 2.19 శాతం చొప్పన అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. భారత వైమానిక దాడుల దెబ్బకు పాకిస్థాన్ మార్కెట్లు కుప్పకూలాయి. బుధవారం సెషన్‌లో నూ భారీ నష్టాలు చవి చూసిన కెఎస్ఇ-30 సూ చీ గురువారం మరో 7.2 శాతం పతనమయ్యిం ది. కరాచీ సమీపంలో భారత సైనిక బలగాలు విరుచుకుపడ్డాయన్న సమాచారం వ్యాపించడం తో అరగంట పాటు ట్రేడింగ్‌ను నిలిపివేశారు.**

# జపాన్‌ను అధిగమించిన భారత్.. ప్రపంచంలోనే నాలుగో స్థానం!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల వల్ల ఏర్పడిన అనిశ్చితి వృద్ధి రేటు తగ్గుదలకు కారణమని అంతర్జాతీయ ద్రవ్య నిధి నివేదిక పేర్కొంది. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. భారతదేశం 2025 నాటికి జపాన్‌ను అధిగమించి ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి విడుదల చేసిన వరల్డ్ ఎకనామిక్ ఔట్‌లుక్ ఏప్రిల్ 2025లో ఈ సమాచారం విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం, భారతదేశ నామమాత్రపు Gఔూ వి4187.017 బిలియన్లకు పెరుగుతుంది. మరోవైపు, జపాన్ జిడిపి వి4186.431 బిలియన్లుగా అంచనా వేసింది. భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. జిడిపి పరంగా భారతదేశం తరువాత అమెరికా, చైనా, జర్మనీ, జపాన్ ఉన్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి ప్రకారం, రాబోయే సంవత్సరాల్లో భారతదేశం జర్మనీని అధిగమించి ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అంచనా. 2027 నాటికి భారతదేశ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లను దాటుతుంది. ఆ సమయంలో భారతదేశ Gఔూ 5069.47 బిలియన్ డాలర్లుగా ఉంటుంది. అదే సమయంలో 2028 లో భారతదేశ జిడిపి 5584.476 బిలియన్ డాలర్లుగా ఉంటుంది. ఆ సమయంలో జర్మనీ Gఔూ 5251.928 బిలియన్ డాలర్లుగా ఉంటుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల వల్ల ఏర్పడిన అనిశ్చితి వృద్ధి రేటు తగ్గుదలకు కారణమని అంతర్జాతీయ ద్రవ్య నిధి నివేదిక పేర్కొంది. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. రాబోయే రెండేళ్లలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ 6 శాతం వృద్ధి రేటుతో వృద్ధి చెందే ఏకైక ఆర్థిక వ్యవస్థగా ఉంటుంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథన్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 2025 ప్రపంచ ఆర్థిక ఔట్‌లుక్ ప్రపంచ వృద్ధి రేటును 2.8 శాతంగా అంచనా వేసిందని అన్నారు. ఇందులో 127 దేశాల వృద్ధి రేటు తగ్గుదల కూడా ఉంది. ఇది ప్రపంచ జిడిపిలో 86 శాతం. ఇదిలా ఉండగా, ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడి చేశారు. భారతదేశం, పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తత దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటును ప్రభావితం చేసే అవకాశం ఉంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి భారతదేశ జిడిపి వృద్ధి రేటును 6.2 శాతంగా అంచనా వేసింది. ప్రపంచ బ్యాంకు దీనిని 6.3 శాతంగా అంచనా వేసింది. ఆ తరువాత మూడీస్ కూడా భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటును 6.3 శాతానికి సవరించింది.

# భారత్‌తో దూకుడు వద్దు

## పాక్ ప్రధానికి నవాజ్ షరీఫ్ సూచన!



పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా భారత్ దాడులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్థాన్.. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాలపై డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో దూకుడుగా వ్యవహరించవద్దని, దౌత్యమార్గాల్లోనే పరిష్కరించుకునేందుకు ప్రత్నించాలని ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు పాకిస్థాన్ ముస్లింలీగ్‌నవాజ్ చీఫ్, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సూచించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా భారత్‌తో సంప్రదింపులు చేసేందుకు వ్యక్తిగతంగా నవాజ్ ప్రయత్నాలు చేస్తున్నట్లు స్థానిక మీడియా పేర్కొంది.

# మళ్లీ షాకిచ్చిన బంగారం..



భారతీయులకు బంగారం అంటే ఎంతో ఆసక్తి ఉంటుందన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో పసిడి కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. కానీ ఈ సమయంలోనే సామాన్యులకు షాకిస్తున్నాయి బంగారం ధరలు. కొన్ని రోజులుగా పరుగులు పెడుతూ ఊహించని విధంగా ధరలలో మార్పు చోటు చేసుకుంటుంది. బంగారం ధరలు మళ్లీ షాకిస్తున్నారు. గత నాలుగు రోజుల క్రితం నెమ్మదిగా తగ్గుతూ వచ్చిన పసిడి.. ఇప్పుడు ఊహించని విధంగా పెరిగింది. నిన్న ఒక్క గోల్డ్ రేట్స్ లో మార్పులు జరగ్గా.. ఈరోజు అంటే శుక్రవారం ఉదయం స్వల్పంగా పెరిగాయి. దేశీయ మార్కెట్లో శుక్రవారం ఉదయం 7 గంటల సమయానికి 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.91,310 ఉండగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ. 99,610కు చేరింది. దీంతో అటు దేశంలోని పలు ప్రధాన నగరాల్లోనూ బంగారం ధరలలో మార్పులు చోటు చేసుకున్నాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లోనూ పసిడి ధరలు భారీగా పెరిగాయి. శుక్రవారం ఉదయం హైదరాబాద్?లో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.91,310 ఉండగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,610కు చేరింది. అలాగే విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, నిజామాబాద్ వంటి ప్రాంతాల్లోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ఇక దేశ రాజధాని ఢల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.91,460 ఉండగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.99,610కు చేరింది. అలాగే ముంబైలో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రూ.91,310 చేరగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,760కు చేరింది. ఇక బెంగుళూరులో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 91,310 ఉండగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,610 వద్ద కొనసాగుతుంది. అలాగే చెన్నైలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి రూ.91,310కు చేరగా.. 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.99,610కు చేరింది.

# కియా నుంచి కారెన్స్ క్లావిస్

**దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం కియా.. తన పాపులర్ కారు కారెన్స్‌లో ప్రీమియం వెర్షన్ 'కారెన్స్ క్లావిస్'ను గురువారం ఆవిష్కరించింది. భారత్ నుంచే అంతర్జాతీయ మార్కెట్లోకి ఈ కారును విడుదల చేసినట్లు కియా ఇండియా హెడ్ హర్దీప్ సింగ్ బ్రార్ వెల్లడిరచారు. దేశీయ మార్కెట్లో ఎంపీవీ, ఎస్‌యూవీ 7 సీట్ల విభాగాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ కొత్త మోడల్‌ను తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. ప్రీమియం ఫీచర్లు, మూడు వరుసల్లో సీటింగ్ సహా మరికొన్ని ప్రత్యేకమైన ఫీచర్లతో కారెన్స్ క్లావిసను రూపొందించినట్లు ఆయన తెలిపారు. మాన్యువల్, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌స్‌తో పెట్రోల్, డీజిల్ వేరియంట్లలో ఈ కారు అందుబాటులో ఉండనుంది. ఈ కారు బుకింగ్‌స్‌ను కియా ఇప్పటికే ప్రారంభించగా ధరను మాత్రం నెలాఖరులో ప్రకటించనుంది. కారెన్స్ విడుదల చేసిన మూడేళ్లలోనే 2 లక్షల యూనిట్లను విక్రయించినట్లు కియా ఇండియా ఎండీ, సీఈఓ గ్వాంగు లీ తెలిపారు.**



# 30 ఏళ్ల వయసులో కూడా యవ్వనంగా ఉండాలంటే..



వయస్సు పెరిగే కొద్దీ ఒత్తిడి, జీవన విధానంలో మార్పులు, హార్మోన్ సమస్యల కారణంగా చర్మం ఆరోగ్యాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా 30 దాటిన తర్వాత చర్మం తన సహజ కాంతిని తగ్గించుకుంటుంది. ఈ పరిస్థితులను నియంత్రించాలంటే ఆహారంలో పౌష్టికమైన పదార్థాలు తప్పనిసరిగా ఉండాలి.బొప్పాయిలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు చర్మంపై ప్రభావితం చేసే మాలిన్యాలను తగ్గిస్తాయి. బొప్పాయి తినడం వల్ల చర్మం తాజాగా నిగారింపుగా కనిపిస్తుంది. రకరకాల కాలుష్యాల వల్ల చర్మం మురికిగా మారినప్పుడు బొప్పాయి దానికి సహజ చికిత్సగా మారుతుంది. పాలకూరలో ఐరన్, ఫోలేట్ లాంటి ఖనిజాలు ఎక్కువగా లభిస్తాయి. ఇవి శరీరంలో రక్త ప్రసరణను మెరుగుపరచి చర్మానికి పోషణను అందిస్తాయి. వారానికి రెండు లేదా మూడు సార్లు పాలకూరను ఆహారంగా తీసుకుంటే చర్మం చక్కగా మెరుస్తుంది. అవకాడోలో ఉండే మోనోసాచ్యురేటెడ్ ఫ్యాట్లు చర్మానికి తేమనిచ్చే పనిలో నిపుణుల్లా పని చేస్తాయి. దీనివల్ల చర్మం పొడిబారకుండా సున్నితంగా మారుతుంది. వయస్సుతో వచ్చే ముడతలను తగ్గించడంలో అవకాడో సహాయపడుతుంది. బాదం, జీడిపప్పు, పిస్తా లాంటి డ్రై ఫ్రూట్స్ లలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, జింక్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని దెబ్బతిన్న కణాలను మరల పునరుత్పత్తి చేస్తాయి. రోజూ కొద్దిగా ఇవి తినడం వల్ల చర్మం ఆరోగ్యంగా మారుతుంది. గ్రీన్ టీలో ఉండే పాలీఫినాల్స్ శరీరంలోని వ్యర్థాలను తొలగించడంలో సహాయపడతాయి. శరీర శుద్ధి జరిగితే చర్మం సహజంగా మెరిసిపోతుంది. రోజు రెండు సార్లు గ్రీన్ టీ తాగడం ద్వారా చర్మం సజీవంగా మారుతుంది. పెరుగు లాంటి పులియబెట్టిన పదార్థాలు జీర్ణ వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ఇది మానసికంగా తేలికగా ఉండడాన్ని కలిగించి చర్మానికి మెరుగైన ప్రభావాన్ని ఇస్తుంది. నిత్యం పెరుగు తీసుకోవడం వల్ల ముఖం ప్రకాశవంతంగా మారుతుంది. విటమిన్‌లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండే డార్క్ చాక్లెట్ తినడం వల్ల చర్మానికి రక్తప్రసరణ బాగా జరుగుతుంది. ఇది చర్మాన్ని తేమగా ఉంచుతుంది. అయితే మితంగా మాత్రమే తీసుకోవడం మంచిది. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ లాంటి బెర్రీస్ లో విటమిన్ సి, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని లోపల నుంచి శుభ్రం చేయడంలో సహాయపడతాయి. యాంటీ ఏజింగ్ లక్షణాలను తగ్గించడంలో ఇవి మద్దతిస్తాయి. 30 ఏళ్ల తరువాత కూడా చర్మాన్ని అందంగా, ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే పోషకాహారం చాలా ముఖ్యం. పై చెప్పిన సహజ పదార్థాలను ఆహారంలో చేర్చితే చర్మ ఆరోగ్యం మెరుగవుతుంది.

# ఇవి తింటే మొఖం మీద నల్ల మచ్చలు గ్యారెంటీ



మన చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం పైకి క్రీములు రాసుకుంటే సరిపోదు. మనం తినే తిండి కూడా మన ముఖంపై వెంటనే ప్రభావం చూపిస్తుంది. కొన్ని రకాల ఆహారాలు తింటే మొటిమలు, మచ్చలు, నలుపు వంటివి వచ్చేస్తాయి. అలాంటి ఆహారాలు ఏంటో తెలుసుకొని వాటిని తక్కువగా తింటే మన ముఖం కాంతివంతంగా ఉంటుంది. రోజూ తీపి పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో గ్లూకోజ్ స్థాయి పెరుగుతుంది. దీని ప్రభావంతో హార్మోన్ల సమతుల్యత తప్పిపోయే అవకాశం ఉంటుంది. ఈ మార్పుల కారణంగా ముఖంపై నల్లటి మచ్చలు, మొటిమలు వంటి సమస్యలు ఎదురవుతాయి. కాబట్టి తీపి పదార్థాలు మితంగా తీసుకోవడం అవసరం. పాలు, పెరుగు, చీజ్ వంటివి ఎక్కువగా తినడం వల్ల శరీరంలోని ఇన్సులిన్ స్థాయిలో మార్పులు వస్తాయి. ఇది చర్మంపై ప్రతికూల ప్రభావాన్ని చూపించవచ్చు. ఈ పరిస్థితులు ముఖంపై నలుపు మచ్చలు ఏర్పడేలా చేస్తాయి. కాబట్టి డైరీ ఫుడ్ ను అవసరానికి మించి తీసుకోవద్దు. బర్గర్లు, పిజ్జాలు, నూనెలో వేయించిన ఆహారాల్లో మంచి పోషకాలు ఉండవు. ఇవి మన శరీరాన్ని చెడు పదార్థాలతో నింపుతాయి. దానివల్ల చర్మం బాగోదు మచ్చలు కూడా వస్తాయి. చాక్లెట్లు తీపి పదార్థాలే కాకుండా.. వాటిలో పాల పదార్థాలు కూడా ఉంటాయి. ఈ రెండు కారణాల వల్ల ముఖంపై మచ్చలు రావడం, చర్మం పొడిబారడం లాంటి సమస్యలు వస్తాయి. చాక్లెట్లు లిమిటెడ్ గా తీసుకోవడం మంచిది. అరటి పండ్లలో సహజంగా ఉన్న చక్కెరలు ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువగా తీసుకుంటే గ్లూకోజ్ స్థాయి పెరిగే అవకాశం ఉంటుంది. దీని ప్రభావం చర్మంపై కూడా పడుతుంది. మచ్చలు, మొటిమలు వచ్చే అవకాశాలు ఎక్కువవుతాయి.రోజుకు ఎక్కువ కాఫీ తాగితే శరీరంలోని హార్మోన్లు మారతాయి. కాఫీలో ఉండే కెఫీన్ వల్ల ముఖంపై మచ్చలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ఖాళీ కడుపుతో తాగితే ఇది ఇంకా ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. ముఖం అందంగా, ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలి. ఎక్కువగా తీపి పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్, పాల పదార్థాలు తీసుకోకుండా ఉంటే చర్మాన్ని కాపాడుకోవచ్చు.

# కీరదోస ఎలా తినాలి?



సాధారణంగా కీరదోస తొక్కలు తీసి తింటే రుచిగా ఉంటుంది. నిజానికి, తొక్క భాగం ఎక్కువ పోషకమైనదట. దోసకాయ తొక్కలలో ఫైబర్, విటమిన్ కె, యాంటీఆక్సిడెంట్లు, సిలికా వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. కీరదోస తొక్క చేదుగా, కాస్త గట్టిగా కూడా ఉంటుంది. వేసవిలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి చక్కని పరిష్కారం కీరదోస. చాలా మంది కీరదోస తొక్క తీసి తింటారు. కొంతమంది తొక్క తీయకుండానే అలాగే తింటారు. కానీ కీరదోస అసలు ఎలా తింటే ఆరోగ్యానికి మంచిదో చాలా మందికి తెలియదు. సాధారణంగా కీరదోస తొక్కలు తీసి తింటే రుచిగా ఉంటుంది. నిజానికి, తొక్క భాగం ఎక్కువ పోషకమైనదట. దోసకాయ తొక్కలలో ఫైబర్, విటమిన్ కె, యాంటీఆక్సిడెంట్లు, సిలికా వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. కీరదోస తొక్క చేదుగా, కాస్త గట్టిగా కూడా ఉంటుంది. పైగా సాగు సమయంలో ఉపయోగించే పురుగుమందులు వీటిపై ఉంటాయి. ఇది శరీరానికి చాలా హానికరం. ఈ కారణంగా రసాయనాల ప్రభావాలను నివారించడానికి చాలా మంది కీరదోస తొక్క తీసి తినేందుకు ఆసక్తి చూపుతారు. అయితే వీటిపై ఉండే రసాయనాలు పోవాలంటే చల్లటి నీటిలో బాగా కడిగి, కొద్దిగా ఉప్పు లేదా బేకింగ్ సోడాతో శుభ్రం చేస్తే పురుగుమందులు తొలగిపోతాయని నిపుణులు అంటున్నారు. ఇప్పుడు తొక్కతోనే తినడం పూర్తిగా సురక్షితం. నిపుణుల అభిప్రాయం ప్రకారం, దోసకాయలను తొక్క తీయకుండా తినడం వల్ల అనేక ముఖ్యమైన పోషకాలు లభిస్తాయి. లోపలి భాగాన్ని మాత్రమే తినడం ద్వారా నీరు, కొద్ది మొత్తంలో ఫైబర్ మాత్రమే లభిస్తుందట. అందువల్ల కీరదోస తినడానికి ముందు వాటిని బాగా కడగడం మంచిది. దోసకాయ తొక్క తీయాలా.. వద్దా.. అనేది పూర్తిగా మీ ప్రాధాన్యత, శుభ్రపరిచే పద్ధతిపై ఆధారపడి ఉంటుంది. మీరు కీరదోస పూర్తి పోషకాలకు పొందాలనుకుంటే, ఆరోగ్యానికి 100 శాతం ప్రయోజనాలను పొందాలనుకుంటే, దానిని బాగా కడిగి తొక్క తీయకుండా తినండి.

# మీల్ మేకర్ మంచురియాని ఇలా చేసి పెట్టండి..



భారతీయులు భోజన ప్రియులు. రకరకాల ఆహార పదార్థాలను ఎంతో ఇష్టంగా తింటారు. అంతేకాదు సాంప్రదాయ ఆహారానికి వెస్ట్రన్ స్టైల్ ని జత చేసి సరికొత్త ఆహారపదార్థాలను కూడా సృష్టిస్తారు. అలా ఎక్కువగా ఫేమస్ అయ్యాయి ఇండోచైనీస్ వంటలు. న్యుడిల్స్, మంచూరియా, ఫ్రైడ్ రైస్ వంటి చైనా వంటలకు భారతీయుల రుచులని కలిపి సరికొత్త ఆహారాన్ని తయారు చేస్తున్నారు. మంచరియాలో వెజ్, నాన్ వెజ్ కూడా ఉన్నాయి. సోయాతో చేసే మీల్ మేకర్ తో రకరకాల వంటకాలతో పాటు మీల్ మేకర్ పకోడీ వంటి స్నాక్స్ ని కూడా తయారు చేస్తారు. అయితే ఈ మీల్ మేకర్ తో మంచురియా కూడా చేసుకోవచ్చు అని కొంతమందికి మాత్రమే తెలుసు. ఆరోగ్యానికి ఆరోగ్యం రుచికి రుచి ఉండే ఈ మీల్ మేకర్ మంచురియాని తక్కువ సమయంలోనే టేస్టీగా చేసుకోవచ్చు. దీనిని అలాగే చిరు తిండిగా తినవచ్చు.. లేదా ఫ్రైడ్ రైస్, నూడుల్స్‌తో కలిపి ఆస్వాదించవచ్చు.

కావలసిన పదార్థాలు: మీల్ మేకర్ రెండు కప్పులు/ అల్లం వెల్లుల్లి పేస్టు ఒక స్పూను /ఉల్లికాడల తరుగు రెండు స్పూన్లు/ పచ్చిమిర్చి నాలుగు/వెల్లుల్లి అర స్పూను ముక్కలు/అల్లం అర స్పూను ముక్కలు/ కార్న్ ఫ్లోర్ మూడు స్పూన్లు/మైదా పిండి రెండు స్పూన్లు/ఉప్పు రుచికి సరిపడా/ షెజ్వాన్ సాస్ ఒక స్పూను/సోయాసాస్ ఒక స్పూను/టమోటో సాస్ రెండు స్పూన్లు/మిరియాల పొడి అర స్పూను/ వెనిగర్ ఒక స్పూను/ నూనె వేయించడానికి సరిపడా/కొత్తిమీర నిమ్మకాయ/నీళ్లు కావలసినంత/

తయారీ విధానం: ముందుగా ఒక గిన్నె తీసుకుని మీల్ మేకర్ల వేసి తగినంత నీరు పోసి కొంచెం ఉప్పు వేసి రెండు నిముషాలు ఉడికించాలి. తర్వాత వీటిని వేడి నీటి నుంచి తీసి .. పక్కకు పెట్టుకుని.. కొంచెం చల్లారిన తర్వాత నీరు లేకుండా మీల్ మేకర్లను పిండుకోవాలి.

ఇప్పుడు ఒక గిన్నె తీసుకుని మిల్ మేకరస్ ను వేసుకుని కొంచెం ఉప్పు షెజ్వాన్ సాస్, అల్లం వెల్లుల్లి పేస్ట్, మైదా పిండి, కార్న్ ఫ్లోర్, సోయా సాస్ వేసి.. మీల్ మేకర్స్ ను బాగా మిక్స్ చేయాలి. ఇప్పుడు స్టవ్ వెలిగించి బాణలి పెట్టి నూనె వేయాలి. నూనె వేడెక్కిన తర్వాత మ్యారినేట్ చేసిన మిల్ మేకర్లను వేసి వేయించుకుని ఒక ప్లేట్ లోకి తీసుకోవాలి. ఒక చిన్న గిన్నె తీసుకుని అందులో నీరు కార్న్ ఫ్లోర్ పిండి వేసి బాగా కలిపి పక్కకు పెట్టుకోవాలి. ఇప్పుడు వేరే పాన్ పెట్టి కొంచెం నూనె వేసి వేడి ఎక్కిన తర్వాత అల్లం తరుగు వెల్లుల్లి తరుగు వేసి వేయించాలి. ఇప్పుడు కట్ చేసిన పచ్చిమిర్చి, ఉల్లికాడల ముక్కలు వేసి వేయించుకోవాలి. తర్వాత మిరియాల పొడి కొంచెం ఉప్పు వేసి కలిపి.. తర్వాత షెజ్వాన్ సాస్, టమాటో కెచప్, సోయాసాస్, కొంచెం వెనిగర్ వేసి బాగా కలపాలి. ఇప్పుడు కార్న్ ఫ్లోర్ నీళ్లను వేసి బాగా కలిపి మరుగుతున్న సమయంలో వేయించి పెట్టుకున్న మీల్ మేకర్లను వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం బాగా దగ్గర అయ్యేవరకూ స్విమ్ లో పెట్టి వేయించండి. చివరగా కట్ చేసుకున్న కొత్తిమీర వేసి ఒక ప్లేట్ లోకి తీసుకుని ఉల్లిపాయ ముక్కలు, నిమ్మకాయ పెట్టి సర్వ్ చేయండి. దీనిని పిల్లలకు పెద్దలకు కూడా బాగా ఇష్టంగా తింటారు.

# మర్చిపోకుండా ఉండేందుకు జపనీస్ వాడే మైండ్ ట్రిక్స్..

తెలివితేటలు, క్రమశిక్షణ వంటి పదాలు చెప్పగానే ముందుగా గుర్తొచ్చేది జపాన్ దేశమే. వీరి ఇంటిలిజెన్స్ ను ఉపయోగించి చేసే తయారు చేసే టెక్నాలజీకి ప్రపంచవ్యాప్తంగా పేరుంది. అయితే, వీరు ఏ విషయాన్నైనా మర్చిపోకుండా ఎలా గుర్తుపెట్టుకుంటారు అనేది అంతుచిక్కని విషయం. అందుకోసం వీరు కొన్ని టెక్నిక్స్ ను ఉపయోగిస్తారట. వీటివల్లే వారు అంత తెలివిగా ఉంటారంటారు. మెదడులో సమాచారాన్ని ఎక్కువ కాలం నిలిపి ఉంచేందుకు షిచిడా పద్ధతి ఉపయోగపడుతుంది. ఈ విధానంలో సమాచారాన్ని రంగుల బొమ్మలు లేదా కథల రూపంలో ఊహించుకోవడం జరుగుతుంది. ఉదాహరణకు, ఒక జాబితాను గుర్తుంచుకోవాలంటే, దానిని ఒక సజీవ కథగా మార్చి, మెదడు సృజనాత్మక భాగాన్ని ఉత్తేజపరచడం ద్వారా గుర్తుంపు సులభమవుతుంది. ఈ పద్ధతి జపాన్ విద్యా విధానాల్లో విస్తృతంగా ఉపయోగిస్తుంటారు. ఎన్‌బ్యాక్ టెక్నిక్ మెదడు గుర్తుంచుకునే సామర్థ్యాన్ని, ఏకాగ్రతను పెంచే మానసిక వ్యాయామం. ఈ పద్ధతిలో ఒక వరుసలోని అంశాలను కొన్ని దశల ముందు నుంచి గుర్తుచేసుకోవాలి. ఉదాహరణకు, రెండు లేదా మూడు అంశాల ముందు ఉన్న వాటిని గుర్తుంచుకోవడం. ఈ విధానం ద్వారా క్రమంగా మెదడు పనితీరు మెరుగుపడి, సమాచారాన్ని త్వరగా గ్రహించే సామర్థ్యం పెరుగుతుంది. సంక్లిష్ట సమాచారాన్ని చిన్న, సులభమైన భాగాలుగా విభజించడం చంకింగ్ పద్ధతి యొక్క ప్రధాన ఉద్దేశం. జపాన్ కాంజీ అక్షరాలను నేర్చుకునే విధానం నుంచి ఈ టెక్నిక్ పుట్టింది. ఉదాహరణకు, ఒక పెద్ద సంఖ్యను గుర్తుంచుకోవాలంటే, దానిని చిన్న సమూహాలుగా విభజించి నేర్చుకోవడం ద్వారా మెదడుకు సులభతరం అవుతుంది. ఈ విధానం సమాచారాన్ని వ్యవస్థీకరించడంలో సహాయపడుతుంది. సమాచారాన్ని దీర్ఘకాలం గుర్తుంచుకోవడానికి స్పేస్డ్ రిపిటీషన్ అనేది ఒక శక్తివంతమైన పద్ధతి. ఈ టెక్నిక్‌లో సమాచారాన్ని నిర్దిష్ట వ్యవధులలో (ఉదాహరణకు, 1 రోజు, 3 రోజులు, 7 రోజులు) పునరావృతం చేయడం జరుగుతుంది. భాషా నేర్చుకోవడంలో ఈ పద్ధతి ఎక్కువగా ఉపయోగించబడుతుంది. క్రమం తప్పకుండా పునరావృతం చేయడం వల్ల మెదడు సమాచారాన్ని బలంగా నిలుపుకుంటుంది. మైండ్ మ్యాపింగ్ అనేది సమాచారాన్ని దృశ్య రూపంలో రూపొందించే పద్ధతి. ఒక కేంద్ర ఆలోచన చుట్టూ సంబంధిత విషయాలను చిత్రం లేదా రేఖాచిత్రం రూపంలో అనుసంధానం చేయడం ద్వారా ఈ టెక్నిక్ పనిచేస్తుంది. ఈ విధానం సమాచారాన్ని వ్యవస్థీకరించడంతో పాటు, దానిని సులభంగా గుర్తుంచుకోవడంలో సహాయపడుతుంది. జపాన్ విద్యార్థులు ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. పురుసాటో టెక్నిక్ సమాచారాన్ని మనసుకు సుపరిచితమైన స్థలాలు లేదా వ్యక్తిగత జ్ఞాపకాలతో అనుసంధానం చేసే పద్ధతి. ఉదాహరణకు, మీ సొంత ఊరిలోని ఒక ప్రదేశంతో సమాచారాన్ని జోడిరచడం ద్వారా భావోద్వేగ సంబంధాన్ని ఏర్పరచుకోవచ్చు. ఈ భావోద్వేగ అనుబంధం మెదడులో సమాచారాన్ని ఎక్కువ కాలం నిలిపి ఉంచడంలో సహాయపడుతుంది.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొట్లపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# కీర్తి హాస్పిటల్ ప్రారంభించిన మంత్రి సీతక్క,ఎమ్మెల్యే నాయిని

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

హనుమకొండ నయీమ్ నగర్ లో కీర్తి ఉమెన్స్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ను శుక్రవారం మంత్రి దనసరి అనసూయ సీతక్క,ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం మంత్రి సీతక్క ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సంయుక్తంగా మాట్లాడుతూ.50 పడకల ఆసుపత్రి. నవజాతి శిశు పిల్లల అత్యవసర చికిత్స మరియు మహిళల ఆరోగ్య సంరక్షణ,అత్యుత్తమ సేవలు 24/7 అందుబాటులో అందరికి అందుబాటులో పిల్లల హాస్పిటల్ ఉండటం గర్వకారణం అని,హాస్పిటల్ లో అన్నిరకాల సదుపాయాలు ఉన్నాయని అన్నారు.ఈ హాస్పిటల్ లో అనుభవం గల డాక్టర్స్ ఉన్నారని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో
వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ చాడ స్వాతి శ్రీనివాస్ రెడ్డి,హాస్పిటల్ నిర్వహకులు డాక్టర్ ముక్క దిలీప్ కుమార్ డాక్టర్లు హాస్పటల్ సిబ్బంది కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి

**ఉప్పల్,తెలంగాణ ముచ్చట్లు:**

ప్రముఖ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ,కాప్రా మున్సిపల్ మాజీ చైర్మన్,ఉప్పల్ శాసనసభ నియోజకవర్గ తొలి శాసనసభ్యుడు,టిటిడి బోర్డు మాజీ సభ్యుడు,సంఘ సేవకుడు,నిగర్వి ,విలువలకు ప్రాధాన్యత ఇచ్చే రాజకీయ నాయకుడు బండారి రాజిరెడ్డి పార్థివ దేహానికి శుక్రవారం ఉదయం హబ్సిగూడలోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజిరెడ్డి ఉప్పల్ నియోజకవర్గాలు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.నిజాయితీ నిబద్ధతగల రాజకీయ నేత రాజిరెడ్డి అని పేర్కొన్నారు. ఉప్పల్ ప్రజల గుండెల్లో ఆయన శిరస్థాయిగా నిలబడిపోయారని అన్నారు. ప్రజలకు ఏదో ఒకటి చేయాలనే తపన రాజిరెడ్డిలో ఎప్పుడు కనబడేదని ఆయన గుర్తు చేశారు.ఈకార్యక్రమంలో ఉప్పల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడ్డం రవికుమార్ పాల్గొని రాజిరెడ్డికి నివాళులర్పించారు.





# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **త్వరలో అక్రెడిటేషన్లు, ప్రొఫెషనల్ కమిటీల ఏర్పాటు**
- **టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందానికి మంత్రి పొంగులేటి హామీ**

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఒక్కొక్కటిగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.

శుక్రవారం నాడు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కే.విరాహత్ అలీ,కే.రాంనారాయణల నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం మంత్రి శ్రీనివాస్ రెడ్డితో సచివాలయంలోని ఆయన ఛాంబర్ లో సమావేశమై జర్నలిస్టుల వివిధ సమస్యలపై చర్చించింది.ఎన్నికల సమయంలో,కాంగ్రెస్ మేనిఫెస్టోలో జర్నలిస్టుల సంక్షేమాన్ని పొందుపర్చడంతో జర్నలిస్టులు ఎంతో హర్షించారని,అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా ఇంకా ఏ ఒక్క సమస్యకు పరిష్కారం దక్కకపోవడంతో జర్నలిస్టుల్లో నిరాశ చోటుచేసుకుందని విరాహత్,రాంనారాయణలు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రెడిటేషన్ల నియమావళి రూపకల్పనా కోసం ప్రభుత్వం కమిటీ వేసిందని ,ఆ కమిటీ నివేదిక సమర్పించి నెల రోజులు గడుస్తున్నా ఇంకా జీవో జారీ కాలేదన్నారు.గత ప్రభుత్వం జారీ చేసిన అక్రెడిటేషన్లను ఏడాదిన్నర కాలంగా జర్నలిస్టులు రెన్యూవల్ చేసుకుంటున్న పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే కొత్త అక్రెడిటేషన్లు జారీ చేసేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలకు వ్యతిరేకంగా ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కేవలం అర్బన్ ప్రాంతాల్లో సొసైటీల వరకే వర్తిస్తుందని,గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు కాదని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వర్తించేందుకు గాను వారికి రక్షణ కల్పించేందుకు,సామాజిక సేవలో నిమగ్నమైన జర్నలిస్టుల సంక్షేమం కోసం ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు అనేక జీవో లు జారీ చేసి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశాయని,గత పదేళ్లుగా వాటిని నిర్వీర్యం చేసారని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.జర్నలిస్టులపై దాడుల నిరోధక హైపవర్ కమిటీ,వర్కింగ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ ఫండ్ కమిటీ,వేజ్ బోర్డు సిఫారసులను పర్యవేక్షించే త్రైపాక్షిక కమిటీని ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.చిన్న,మధ్యతరగతి పత్రికల బిల్లులు పెండింగులో ఉండడం,అప్ గ్రేడేషన్ ప్రక్రియ జరగక పోవడంతో వాటి నిర్వాహకులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు.రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం మునగనూరు గ్రామ శివారులో ఎల్.బి.నగర్ జర్నలిస్టులకు ఏడాదిన్నర క్రితం ఇంటి స్థలాలు కేటాయించగా వారు ఇండ్లను సైతం నిర్మించుకున్నారని,అయితే ఆ స్థలాలను ఖాళీ చేయాలని గత కొన్ని రోజుల నుండి రెవెన్యూ అధికారులు లబ్దిదారులను మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారని, వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపాలని వారు మంత్రిని కోరారు. టీయూడబ్ల్యూజే విన్నవించిన ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీనివాస్ రెడ్డి, త్వరలోనే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు.మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు కే.శ్రీకాంత్ రెడ్డి, జి.మధు గౌడ్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రాజేష్,రాష్ట్ర చిన్న,మధ్య తరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు,రాష్ట్ర నాయకులు మాతంగి దాస్,హెచ్.యూ.జే అధ్యక్షులు శిగా శంకర్ గౌడ్ లు పాల్గొన్నారు.

# ఈనెల 20న ఆమరణ దీక్షకు సిద్ధం

**శంకరపట్నం,తెలంగాణ ముచ్చట్లు:**

మండలంలోని మొలంగూరు గ్రామంలో సర్వేనెబర్ 703 లోని ప్రభుత్వ భూమి కబ్జాదారుల కబంధహస్తాలలలో చిక్కింది. ఈ భూమిని కాపాడి గ్రామంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీలకు కేటాయించాలని వివిధ సందర్భాలలో చేపట్టిన నిరసన,నిరాహార దీక్ష, పోరాటాలు,వినతి పత్రాలకు స్పందించిన జిల్లా కలెక్టర్ మండల రెవెన్యూ అధికారులను సర్వే నిర్వహించాలని ఆదేశించారు. దీంతో మండల రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి హద్దు రాళ్లను ఏర్పరచడం మరిచి కంటి తుడుపు చర్యగా తమ పనిని పూర్తి చేసి చేతులు దులిపేశారు .ఈ విషయంగా ఎన్నిసార్లు అధికారులను కలిసిన నిర్లక్ష్యంగా పెడచె ఉందివిన పెట్టిన సందర్భాలే కానీ విధులను లక్ష్యంగా చేసింది లేదని మండల టీజేఎస్ టిడిపి
నాయకులు మోరే గణేష్, మోరే ప్రభాకర్ లు

**ఆరోపించారు.ఈ నెల 20 లోపు**

మొలంగూరులోని సర్వే నెం. 703లో హద్దులను నిర్ణయించి ఐదర్లు పాతని ఎడల టీజేఎస్,టిడిపి ల సంయుక్త ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శుక్రవారం అంబేద్కర్ విగ్రహం వద్ద మండల రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఆమరణ దీక్షకు పూనుకుంటామని ప్లకార్డులను ప్రదర్శిస్తూ హెచ్చరించారు.టిడిపి నాయకులు ఎండి సాబీర్,గోపి వీరమల్లు,శ్యాం,సాగర్,శివ స్వామి, శ్రీకాంత్ పాల్గొన్నారు.







# యుద్ధంలో భారత్ గెలుపు కోసం ప్రత్యేక పూజలు

- **వీరమరణం పొందిన భారత జవాన్లకు నివాళి**
- **ఆలయ అభివృద్ధికి పాటుపడతా**
- **మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి**

**ప్రజావారధి,తెలంగాణ ముచ్చట్లు:**

దయాది దేశం పాకిస్థాన్ తో జరుగుతున్న యుద్ధంలో అంతిమ విజయం భారత్ దేనని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు. మానకొమానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి శుక్రవారం గట్టుదుద్దెనపల్లి దేవాలయంలో గోపురం నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన యుద్ధంలో భారత్ విజయం సాధించాలని కోరుతూ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయం వెలుపల ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత్ విజయాన్ని దేశ ప్రజలంతా కాంక్షించాలని, భారత్ విజయం సాధించాలని అందరూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయాలని ఆయన కోరారు. అంతేకాకుండా పాక్ తో జరుగుతున్న పోరులో వీరమరణం పొందిన బారత సైనికులకు నివాళులర్పిస్తూ పార్టీ నాయకులు,కార్యకర్తలు, భక్తులతో కలిసి ఆయన మౌనం పాటించారు.

**ఆలయ అభివృద్ధికి పాటుపడతా**

ఎంతో ప్రసిద్ధిగాంచిన గట్టుదుద్దెనపల్లి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి పాటుపడతానని ఎమ్మెల్యే చెప్పారు. మంచి జరుగుతుందనే నమ్మకంతో ప్రజలు నిత్యం ఇక్కడికి వస్తుంటారని. భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని దేవాలయంలో సౌకర్యాలు మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు.ఈ దిశగా తనవంతు కృషి చేస్తానన్నారు. అంతకు ముందుకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు ఆలయ పూజారులు బసవయ్య, రాజేష్,ధర్మకర్తలు శంకర్ లింగం,గోపాల్ రావు, ప్రభాకర్ రెడ్డి,బాకారపు సమ్మయ్య, బాకారపు రమేశ్,చలిగంటి ఓదెలు తదితరులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజ అనంతరం ఆయనకు ఆశీర్వచనాలతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, మానకొండూర్,శంకరపట్నం మండల పార్టీ అధ్యక్షులు నందగిరి రవీంద్రచారి,గోపగోని బస్వయ్యగౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి,పార్టీ నాయకులు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి,కనుకం కుమార్, పెంచాల రాజయ్య,ఆకుల నర్సింగరావు,కనక రాజేశం, ఆకుల బాపురావు,నీరటి మొగిలి,కనకం ఎల్లయ్య, బీరం మల్లేశం,కండెలస్మయ్య, వాల అంజిత్ రావు, బక్కారెడ్డి, నాగిశెట్టి రాజయ్య, మడుపు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష రేసులో బొజ్జ సమ్మయ్య యాదవ్

- కాంగ్రెస్ పార్టీలో 30 ఏళ్ల ప్రస్థానం
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు సుపరిచితులు
- అప్పగించిన పనిని విజయవంతం చేయడం ఆయన నైజం

**వేలేరు,తెలంగాణ ముచ్చట్లు:**

హనుమకొండ డిసిసీ అధ్యక్ష పదవిని ఉమ్మడి వరంగల్ జిల్లాకు సుపరిచితుడైన బొజ్జ సమ్మయ్య యాదవ్ చేపట్టే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో జోరుగా వినిపిస్తోంది. గత ముప్పై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్న సమ్మయ్య యాదవ్ బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు. పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను విజయవంతంగా నెరవేర్చే శైలి ఆయనది. 1992లో ధర్మసాగర్ మండల జనరల్ సెక్రటరీగా రాజకీయ జీవితం ప్రారంభించిన ఆయన, స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ కన్వీనర్‌గా, ఉమ్మడి జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్‌ప్రెసిడెంట్‌గా, గండ్ర వెంకటరమణారెడ్డి అధ్యక్షతన డిసిసీ జనరల్ సెక్రటరీగా పనిచేశారు. ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా రెండు సార్లు సేవలందించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. పార్టీలో నిస్వార్థంగా సేవలందించిన నాయకుడిగా పేరు సంపాదించుకున్న సమ్మయ్య యాదవ్, మున్సిపాలిటీ, ఎంపీపీ, జిల్లా పరిషత్, గ్రామపంచాయతీ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేశారు. రాష్ట్రంలో అధికారం లేకున్నా, మారిన పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ పార్టీ పట్ల ఆయన అవిశ్రాంతమైన నమ్మకాన్ని చూపారు. పదవుల కోరికలకన్నా పార్టీ విజయమే లక్ష్యంగా పని చేశారు.

ప్రస్తుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాదయాత్రలో కీలకపాత్ర పోషించిన సమ్మయ్య యాదవ్, కార్యకర్తలను భారీగా తరలించి పాదయాత్ర విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. అధికారంలోకి రావడంలో ఆయన కృషి గుర్తించదగినది.


బీసీ వర్గానికి చెందిన సమ్మయ్య యాదవ్‌ను హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమిస్తే సముచిత న్యాయం జరుగుతుందని, పార్టీకి బలపడుతుందని నాయకులు, కార్యకర్తలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నేతలు ఆయనకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు. పార్టీ మారాలని వచ్చిన ఒత్తిడులకు కట్టడి పెట్టి, కాంగ్రెస్‌కే కట్టుబడి ఉన్న సమ్మయ్య యాదవ్ వంటి నేతకు డిసిసీ పగ్గాలు అప్పగించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

# ప్రభుత్వ నిషేధిత గుట్కా అంబర్ పట్టివేత

**వేలేరు,తెలంగాణ ముచ్చట్లు:**



వేరే మండల పరిధిలోని మల్లీ కుదుర్ల గ్రామంలో ఈరోజు ఉదయం సుమారు 11 గంటల సమయంలో పోలీసులు తమ విధి నిర్వహణలో భాగంగా పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మల్లీ కుదురుల గ్రామంలో బచ్చు చంద్రయ్య s/oశివలింగం వయస్సు 55 వృత్తి వ్యాపారం నివాసం మల్కీ కుదుర్ల ఇతనికి చెందినటువంటి కిరాణా షాపులో సోదాలు నిర్వహించగా ప్రభుత్వం నిషేధించినటువంటి పొగాకు ఉత్పత్తులు లభించాయి అక్కడ ఉన్నటువంటి షాపు యజమానిని విచారించగా ఈ యొక్క పొగాకు ఉత్పత్తులను ఎవరో గుర్తు తెలవని వ్యక్తులు నాకు విక్రయించినారని నేను ఎక్కువ ధరకు విక్రయించి డబ్బు సంపా దించాలని ఉద్దేశంతో తీసుకున్నానని చెప్పారు, ఈ యొక్క షాప్ లో లభించినటువంటి అంబర్ ప్యాకెట్స్ విలువ 500 రూపాయలు జోడబాయ్ కైని ప్యాకెట్స్ యొక్క విలువ 218 అనార్ గుట్కా ప్యాకెట్స్ యొక్క విలువ 320 రూపాయలు కాగా మొత్తం వీటి యొక్క విలువ1038 రూపాయలుగా నిర్ధారించడం అయినది అలాగే మాకు దొరికినటువంటి పొగాకు ఉత్పత్తులను చూసి ఒక ఆడ మనిషి అక్కడినుండి పారిపోవడాన్ని గమనించి పోలీసు వాళ్ళు వెంబడించి ఆమెను పట్టుకొని విచారించగా ఆమె పేరు గౌరీశెట్టి శ్వేత w/o వెంకటేష్ వయస్సు 32 వృత్తి వ్యాపారం నివాసం సోడాష పెల్లి అని తెలిపింది ఆమె వద్ద ఉన్నటువంటి బ్యాగ్ లో కూడా ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులు లభించాయి పోలీసులు విచారించగా ఇట్టి ఉత్పత్తులను తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు విక్రయించి డబ్బు సంపాదించాలని దురుద్దేశంతో విక్రయిస్తున్నట్లు ఆమె తెలపడం జరిగింది ఏమి బ్యాగులో 1000 రూపాయలు విలువ చేసే అంబర్ ప్యాకెట్లు 276 రూపాయలు విలువ చేసే జోడాబాయ్ కైని ప్యాకెట్లు 640 రూపాయలు విలువ చేసే అనార్ గుట్కా ప్యాకెట్లు లభించాయి మొత్తం వీటి యొక్క విలువ 2576 గా నిర్ధారించడం జరిగింది పై ఇరువురి వద్ద నుండి 3614 రూపాయలు విలువగల పొగాకు ఉత్పత్తులను స్వాధీనపరచుకొని వారిని అదుపులోకి తీసుకొని వేలేరు పోలీస్ స్టేషన్ కి తీసుకువెళ్లి వారిపై చట్టరీత్యా కేసు నమోదు చేయడం జరిగింది



# భక్తి,శాంతి,రక్షణకు మార్గం.. అయ్యప్ప శరణం

**-బిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**

**కుత్బుల్లాపూర్,తెలంగాణ ముచ్చట్లు:**

128 చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ లో శ్రీధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప దేవాలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భక్తి, శాంతి, రక్షణకు మార్గం అయ్యప్ప శరణమని అన్నారు. అయ్యప్ప స్వామి కరుణా కటాక్షలతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. అంతకు ముందు స్థానిక హనుమాన్ దేవాలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్,శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు వరద రాజు,శ్రీశైలం యాదవ్,నరేష్, రాము ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి బావి పనులకు భూమిపూజ

**ప్రజవారధి,తెలంగాణ ముచ్చట్లు:**

మండలం లోని రేణికుంట గ్రామంలో నూతనంగా చేపడుతున్న మంచి నీటి బావి నిర్మాణ పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేణికుంటలోని ఎల్లమ్మ గుడి ప్రాంతంలో చేపడుతున్న మంచినీటి బావి తవ్వకం వల్ల ప్రజల మంచినీటి అవసరాలు తీరుతాయన్నారు.ప్రజలకు ఉపయోగ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి రమేశ్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి,మామిడి అనిల్ కుమార్,రెడ్డిగాని రాజు,రాములు యాదవ్, ఎలుక రాజు,కొత్త తిరుపతి రెడ్డి, బుధారపు శ్రీనివాస్, కొండల్ రావు బోయిని దివాకర్,బొంగోని రాజు, కృష్ణబాబు,హసన్,పులి కృష్ణ, ముక్కిస రత్నాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# దేశ ప్రజలంతా ఏకతాటిపై ఉండి సైనికులకు ప్రతి ఒక్కరూ అండగా నిలుద్దాం

**-ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్ పల్లి,తెలంగాణ ముచ్చట్లు:**

పాకిస్తాన్ పై భారత్ జరుపుతున్న ధర్మ యుద్ధంలో గెలవాలని ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా పూర్తి అవ్వాలని కోరుచూ కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు కెపిహెచ్బి డివిజన్ 6వ ఫేస్ లోని ఉమా రామలింగేశ్వర స్వామి వారి తృతీయ వార్షికోత్సవంలో పాల్గొని. ఉమా రామలింగేశ్వర స్వామి మరియు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజలంతా ఏకతాటిపై ఉండి సైనికులకు అండగా నిలుద్దామని ప్రతి ఒక్కరం ఒక సైనికుడిగా పోరాడే సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు తూము శ్రవణ్ కుమార్,పగుడాల బాబురావు మరియు కాలనీవాసులు అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ హరిహరసుతాన్ అయ్యప్ప స్వామి ఆలయం విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన మహోత్సవం

**కుత్బుల్లాపూర్,తెలంగాణ ముచ్చట్లు:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 128 డివిజన్ భగత్ సింగ్ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీశ్రీశ్రీ హరిహరసుతాన్ అయ్యప్ప స్వామి ఆలయం మరియు విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన మహోత్సవానికి శ్రీధర్మ శాస్త్ర సేవ సమితి వారి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని స్వామి వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించి నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడు సుఖ: సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ టి లక్ష్మ రెడ్డి,భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కొండల శ్రీనాథ్ రావు,ప్రధాన కార్యదర్శి సత్యం,సీనియర్ కాంగ్రెస్ నాయకులు బల్ రెడ్డి మరియు కాలనీ వాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ గా హేమంత్ భోర్ఖడే

**కూకట్ పల్లి,తెలంగాణ ముచ్చట్లు:**

.శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ హేమంత్ భోర్ఖడే ను మర్యాదపూర్వకంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి,జగదీశ్వర్ గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీసీ రోడ్లు,నాలా అభివృద్ధి చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం డివిజన్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ప్రతి డివిజన్ పరిధిలోని కాలనీ,బస్తి అభివృద్ధికి కృషి చేస్తామని, తమ దృష్టికి వచ్చే ప్రతి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జగదీశ్వర్ గౌడ్ తెలిపారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




## రోహిత్ స్థానాన్ని భర్తీ చేయడం కష్టమే

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటిస్తూ తీసుకున్న సంచలన నిర్ణయంపై భారత మాజీ క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. రోహిత్ ఉన్నట్టుండి ఇలాంటి కఠిన నిర్ణయం ఎందుకు తీసుకున్నాడో తనకు ఇంత వరకు అర్థం కాలేదన్నాడు. భారత క్రికెట్‌పై రోహిత్ తనదైన ముద్ర వేశాడన్నాడు. మూడు ఫార్మాట్‌లలోనూ రోహిత్ అసాధారణ బ్యాటింగ్‌ను కనబరిచాడని కపిల్ ప్రశంసించాడు. రోహిత్ లాంటి క్రికెటర్లు చాలా అరుదుగా లభిస్తారన్నాడు. అతని రిటైర్మెంట్ టీమిండియాకు షాక్‌లాంటిదేనని పేర్కొన్నాడు. కీలకమైన ఇంగ్లండ్ పర్యటనకు ముందు రోహిత్ తీసుకున్న నిర్ణయం సరైంది కాదన్నాడు. మరి కొంత కాలం పాటు అతను టెస్టుల్లో కొనసాగి ఉండాల్సిందని సూచించాడు. ఇక రోహిత్ లోటును పూడ్చడం చాలా కష్టంతో కూడుకున్న అంశమన్నాడు. అతని లాగా వేగంగా బ్యాటింగ్ చేయడం అందరికి సాధ్యం కాదన్నాడు. రోహిత్ భారత్‌కు లభించిన ప్రతిభావంతులైన క్రికెటర్లలో ఒకడన్నాడు. కెప్టెన్‌గా, బ్యాటర్‌గా భారత క్రికెట్‌పై తనదైన ముద్ర వేశాడన్నాడు. రోహిత్ వంటి క్రికెటర్లు చాలా అరుదుగా లభిస్తారని కపిల్ దేవ్ పేర్కొన్నాడు.

## ఫేక్ న్యూస్ స్ప్రెడ్ చేయకండి..!

భారత్‌పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నకిలీ వీడియోలపై టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఆందోళన వ్యక్తం చేశాడు. భారత సైన్యం ధైర్యాన్ని ప్రశంసిస్తూ, నకిలీ వార్తలను నమ్మకూడదని, బాధ్యతాయుతంగా ఉండాలని కోరాడు. దేశ రక్షణలో సైన్యం పాత్రను కొనియాడారు. భారత్ పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్ని విషయం తెలిసిందే. ఒక రకంగా రెండు దేశాల మధ్య అనధికారిక యుద్ధం మొదలైందని నిపుణులు అంటున్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట దాడులు చేపట్టింది. దీనికి ప్రతీకారంగా పాకిస్థాన్ జమ్మూ కశ్మీర్‌తో పాటు పలు ప్రాంతాలపై దాడికి యత్నించింది. కానీ, వాటిని భారత్ తప్పికొట్టింది. ఆ తర్వాత భారత్ పాక్‌పై దాడి చేసినట్లు ఇప్పటి వరకు సమాచారం అందుతోంది. ఈ క్రమంలోనే సోషల్ మీడియాలో పలు వీడియోలు వైరల్ అవుతున్నాయి. వాటిలో 90 శాతం ఫేక్ వీడియోలు, ఏఐ జనరేటెడ్ వీడియోలు అంటూ కొంతమంది ఫ్యాక్ట్ చేసి నిరూపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో టీమిండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ స్పందించాడు. ఫేక్ వీడియోలతో పాటు, పాకిస్థాన్ దాడులను తిప్పికొడుతూ, పాక్‌పై దాడి చేస్తున్న సాయుధ దళాల గురించి కూడా రోహిత్ ఎక్స్ వేదికగా స్పందించాడు. "గడిచే ప్రతి క్షణం, తీసుకునే ప్రతి నిర్ణయంతో నేను మన భారత సైన్యం, భారత వైమానిక దళం, భారత నావికాదళం పట్ల చాలా గర్వంగా ఉన్నాను. మన యోధులు మన దేశ గౌరవానికి అండగా నిలుస్తున్నారు. ప్రతి భారతీయుడు బాధ్యతాయుతంగా ఉండటం, నకిలీ వార్తలను వ్యాప్తి చేయకుండా లేదా నమ్మకుండా ఉండటం ముఖ్యం. అందరూ సురక్షితంగా ఉండండి!" అంటూ ట్వీట్ చేశాడు.

# ఐపిఎల్‌ను నిరవధిక వాయిదా: బిసిసిఐ

భారత్‌పాక్ యుద్ధ ఉద్రిక్తతల వేళ... ఐపిఎల్‌ను బిసిసిఐ నిరవధిక వాయిదా వేసింది. భద్రతా కారణాల దృష్ట్యా గురువారం ధర్మశాలలో జరిగిన పంజాబ్, ఢల్లీ మ్యాచ్‌ను మధ్యలోనే నిలిపివేసిన సంగతి తెలిసిందే. పొరపాటున ఏ మిసైల్ లేదా డ్రోన్ దాడి స్టేడియంలో పడితే.. వేలల్లో ప్రేక్షకులు, పదుల సంఖ్యలోని విదేశీ, భారత క్రికెటర్లకు జరిగే ప్రాణనష్టం ఊహకందదంటూ.. నెటిజన్లు సోషల్ ప్లాట్ ఫాంపై అభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐపిఎల్‌ను రద్దు చేయాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) ఉన్నతాధికారులు భావించారు. వినోదం కంటే కూడా దేశ రక్షణ, ఆటగాళ్ల భద్రతే తమకు ప్రధానమని బోర్డు ఉన్నతాధికారి ఒకరు వెల్లడిరచారు. అందుబాటులో ఉన్న బిసిసిఐ ఉన్నతాధికారులతో నేడు సమావేశమై ఐపిఎల్ పై తుది నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం ఐపిఎల్ రద్దు లేదంటే వాయిదా ప్రకటన వెలువడుతుందని బిసిసిఐ వర్గాలు వెల్లడిరచిన నేపథ్యంలో.. ఐపిఎల్‌ను నిరవధిక వాయిదా వేసినట్లు బిసిసిఐ ప్రకటించింది. ఐపిఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితులపై సమీక్షిస్తున్నామన్నారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత ఇంకా కొనసాగుతూనే ఉందని చెప్పారు. ఐపిఎల్ మ్యాచ్‌ల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాల్ని పాటిస్తామన్నారు. ఇప్పటివరకైతే కేంద్రం నుంచి తమకెలాంటి సూచనలు రాలేదని తెలిపారు. ఆటగాళ్ల భద్రత, రవాణా తదితర పరిస్థితుల్ని సమీక్షించాకే తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. లక్నోలో శుక్రవారం లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య జరగాల్సిన మ్యాచ్‌కు ఏ ఇబ్బందులు లేవు కాబట్టి మ్యాచ్ షెడ్యూల్ ప్రకారం జరిగే అవకాశాలే ఉన్నాయని తెలిపారు. ఐపిఎల్ లో నేడు లక్నో వేదికగా ఈరోజు రాత్రి 7 గంటల 30 నిముషాలకు లక్నో వర్సెస్ బెంగళూరు మ్యాచ్ జరగాల్సి ఉంది.




## క్వార్టర్స్‌లో ఆయుష్
## తైపీ ఓపెన్ బ్యాడ్మింటన్ 2025



భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి తైపీ ఓపెన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు. వరుసగా రెండో విజయం నమోదు చేసిన ఆయుష్ శెట్టి పురుషుల సింగిల్స్‌లో సత్తా చాటాడు. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్‌ఫైనల్లో మాజీ వరల్డ్ నం.1, భారత అగ్రశ్రేణి షట్లర్ కిదాంబి శ్రీకాంత్‌పై మూడు గేముల మ్యాచ్‌లో గెలుపొందాడు. గంటకు పైగా సాగిన మ్యాచ్‌లో ఆయుష్ శెట్టి 2116, 1521, 2117తో కిదాంబి శ్రీకాంత్‌పై గెలుపొందాడు. తొలి గేమ్‌ను 2116తో సొంతం చేసుకున్న ఆయుష్.. రెండో గేమ్‌లో కిదాంబికి తలొగ్గాడు. కీలక గేమ్‌లో పైచేయి సాధించిన శ్రీకాంత్ జోరందుకున్నట్టే కనిపించాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో శ్రీకాంత్‌ను చిత్తు చేసిన శెట్టి క్వార్టర్‌ఫైనల్ బెర్త్ కైవసం చేసుకున్నాడు. నేడు సెమీఫైనల్లో చోటు కోసం కెనడా షట్లర్, ఏడో సీడ్ బ్రయాన్ యాంగ్‌తో ఆయుష్ శెట్టి తలపడనున్నాడు. మరో ప్రీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో తరుణ్ మానెపల్లి వరుస గేముల్లో నిరాశపరిచాడు. 34 నిమిషాల్లోనే ముగిసిన మ్యాచ్‌లో 1321, 921తో మహ్మద్ జాకి చేతిలో ఓటమి చెందాడు. మహిళల సింగిల్స్ విభాగంలో అన్‌సీడెడ్ ఉన్నతి హుడా సైతం క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. చైనీస్ తైపీ షట్లర్ లిన్ సి యన్‌పై 2112, 217తో ఉన్నతి మెరుపు విజయం సాధించింది. 27 నిమిషాల్లోనే ప్రత్యర్థిని చిత్తు చేసిన ఉన్నతి నేడు జరిగే క్వార్టర్‌ఫైనల్ సమరంలో మరో చైనీస్ తైపీ షట్లర్ హంగ్ యి టింగ్‌తో పోటీపడనుంది. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్, అనుపమ ఉపాధ్యాయ, అన్మోల్, రక్షిత శ్రీ రామ్‌రాజ్‌లు తొలి రౌండ్లోనే నిష్క్రమించిన సంగతి తెలిసిందే. డబుల్స్ విభాగంలో భారత షట్లరు ఎవరూ పోటీపడటం లేదు. సాత్విక్, చిరాగ్ శెట్టి సహా పుల్లెల గాయత్రి, ట్రెసా జాలిలు తైపీ ఓపెన్‌కు దూరంగా ఉన్నారు. సింగిల్స్ స్టార్ షట్లర్లు పి.వి సింధు, లక్ష్యసేన్, హెచ్.ఎస్ ప్రణరు సైతం తైపీ ఓపెన్‌లో పోటీపడటం లేదు.

## పాకిస్తాన్ సూపర్ లీగ్‌పై నీలి నీడలు

పాకిస్తాన్ సూపర్ లీగ్ (పిఎస్‌ఎల్)పై నీలినీడలు కమ్ముకున్నాయి. బుధవారం అర్ధరాత్రి రావల్పిండి క్రికెట్ స్టేడియం సమీపంలో డ్రోన్ అటాక్ జరిగినట్లు సమాచారం. ఇక్కడే గురువారం రాత్రి పాకిస్తాన్ సూపర్ లీగ్ మ్యాచ్ జరగాల్సి ఉంది. బాబర్ ఆజం కెప్టెన్సీలోని పెషావర్ జల్మీ డేవిడ్ వార్నర్ సారథ్యంలోని కరాచీ కింగ్స్ మధ్య మ్యాచ్ నిర్వహించేందుకు పాక్ క్రికెట్ బోర్డు షెడ్యూల్ ఖరారు చేసింది. అయితే, స్టేడియానికి దగ్గర్లోనే డ్రోన్ దాడి జరగడంతో అప్రమత్తమైన పాక్ బోర్డు.. క్రికెటర్లు రావల్పిండి విడిచి వెళ్లిపోవాలని ఆదేశించినట్లు సమాచారం. అలాగే న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, సౌతాఫ్రికా, జింబాబ్వే తదితర దేశాలకు చెందిన పలువురు క్రికెటర్లు ఈ లీగ్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరోవైపు.. భారత్‌పాక్ పరస్పర దాడుల నేపథ్యంలో తమ పౌరులను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అమెరికా చెప్పడం పరిస్థితుల తీవ్రతకు అద్దం పడుతోంది. ఇలాంటి సమయంలో పాకిస్తాన్ ప్రిమియర్ లీగ్ షెడ్యూల్ ప్రకారం సాగుతుందా? అనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.




## రామ్ చరణ్ క్లాసిక్ సీక్వెల్

35 సంవత్సరాల తర్వాత విడుదలవుతున్న జగదేకవీరుడు అతిలోకసుందరిని ఆస్వాదించడం కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఉన్నారని అడ్వాన్స్ బుకింగ్స్ తేటతెల్లం చేశాయి. 1990 తుఫానులో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు తడిసి ముద్దవుతున్న టైంలో ఈ సినిమా సృష్టించిన రికార్డుల గురించి ఎంత చెప్పినా తక్కువే. మూడు దశాబ్దాల తర్వాత కూడా ఇళయరాజా పాటలు చెవుల్లో అమృతం పోస్తున్నా, చిరంజీవి శ్రీదేవి జంటను అలాగే చూస్తూ ఉండాలని అనిపించినా అదంతా దర్శకుడు రాఘవేంద్రరావు మహాత్యమే. అఫ్కోర్స్ నిర్మాత అశ్వినిదత్ సాహసాన్ని ప్రస్తావించకుండా ఉండలేం. అంత గొప్ప క్లాసిక్ వెనుక మహా యజ్ఞమే జరిగింది. అయితే దీనికి ఎప్పటి నుంచో సీక్వెల్ వస్తే బాగుంటుందనే డిమాండ్ బాహుబలి నుంచి ఎక్కువగా వినిపిస్తోంది. దర్శకేంద్రులు సుముఖంగా లేనప్పటికీ అశ్వినీదత్ మాత్రం సిద్ధంగా ఉన్నారు. రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా చేస్తే బాగుంటుందనేది చిరంజీవి వ్యక్తిగత కోరిక. ఇవాళ రిలీజ్ చేసిన ప్రమోషనల్ ఇంటర్వ్యూలో ఒక ఇంటరెస్టింగ్ ట్విస్ట్ బయట పడిరది. వీడియో ద్వారా టీమ్‌తో మాట్లాడిన రామ్ చరణ్ జగదేకవీరుడు అతిలోకసుందరిలో ఉంగరం ఏమైంది, చేప ఏమైంది లాంటి ప్రశ్నలకు



సమాధానం చెప్పాలని ఈ సందర్భంగా నాగ్ అశ్విన్ ని డిమాండ్ చేస్తున్నానని చెప్పడం ఫ్యాన్స్ ని ఆశ్చర్యానికి గురి చేసింది. అంటే తెరవెనుక దీని గురించి చర్చలైతే జరుగుతున్నాయన్న మాట. చరణ్ ప్రత్యేకంగా నాగ్ అశ్విన్ పేరే ప్రస్తావించడానికి కారణం ఆయన్ని డైరెక్ట్ చేయమని అడగటమేగా. నిజంగా రాజు ఇంద్రజలకు సంతానం కలిగి అతను రామ్ చరణ్ అయ్యి, ఇంకో లోకం నుంచి జాన్వీ కపూర్ వస్తే ఆ కలయిక చాలా బాగుంటుంది.

## బిగ్ మూవీలో ఐటమ్ సాంగ్?



అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో వచ్చిన పుష్ప 2 సినిమాలో కిస్సిక్ అంటూ శ్రీలీల చేసిన ఐటమ్ సాంగ్ సినిమాను మరో స్థాయికి తీసుకు వెళ్లింది. అందుకే శ్రీలీల క్రేజ్ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో పెరిగింది. కిస్సిక్ కారణంగానే బాలీవుడ్‌లో సినిమాను చేసే అవకాశంను దక్కించుకుంది. తమిళనాట కూడా ఈ భామ ఒక సినిమాను చేస్తోంది. హీరోయిన్‌గా వరుసగా సినిమాలు చేస్తున్న శ్రీలీల త్వరలోనే తెలుగులో ఒక బిగ్ సినిమాలో ఐటమ్ సాంగ్ చేయబోతుందనే వార్తలు వస్తున్నాయి. రామ్ చరణ్ హీరోగా ఉప్పెన దర్శకుడు బుచ్చి బాబు దర్శకత్వంలో రూపొందుతున్న పెద్ది సినిమాలో హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. బుచ్చి బాబు ఈ సినిమా కోసం ఒక స్పెషల్ సాంగ్‌ను ప్లాన్ చేస్తున్నాడట. ఈ పాటను శ్రీలీలతో చేయిస్తే ఎలా ఉంటుంది అనే విషయాన్ని నిర్మాతలు చర్చించారని సమాచారం. పుష్ప 2 సినిమాలో శ్రీలీల ఐటమ్ సాంగ్‌తో ఆకట్టుకుంది. దీంతో 'పెద్ది'లో శ్రీలీలను ఐటమ్ సాంగ్ కు ఎంపిక చేస్తే బాగుంటుదని ఫిల్మ్‌మేకర్స్ భావిస్తున్నారట. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించే ఈ పాట సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉంటుందట.

## డ్రాగన్ భామ మీద అవకాశాల వర్షం


ఇండస్ట్రీలో అంతే. ఒక్క హిట్ జాతకాలను మార్చేస్తుంది. ఒక్క ఫ్లాప్ ఎక్కడికో కిందకు తీసుకెళ్తుంది. డ్రాగన్ రూపంలో సూపర్ సక్సెస్ అందుకున్న కయదు లోహర్ మొదటి క్యాటగిరీలోకి వస్తోంది. శ్రీవిష్ణు అల్లూరితో మన ప్రేక్షకులకు పరిచయమైనప్పటికీ డ్రాగన్ వచ్చే దాకా తనలో ఉన్న మేజిక్ జనాలకు అర్థం కాలేదు. కట్ చేస్తే తన డిమాండ్ తెలుగు తమిళ భాషల్లో విపరీతంగా పెరిగిపోయింది. నాని - దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబోలో తెరకెక్కబోయే ది ప్యారడైజ్ లో తనను తీసుకోవడం పక్కాని ఫిలిం నగర్ టాక్. ఇది చాలా పెద్ద ప్రమోషన్. ఈ ప్యాన్ ఇండియా మూవీ మీదున్న అంచనాల దృష్ట్యా ఇది క్రేజీ ఆఫర్. ఇప్పటికే తను విశ్వక్ సేన్ ఫంకీలో భాగమయ్యింది. అనుదీప్ దర్శకత్వం వహిస్తున్న ఈ ఎంటర్ టైనర్ షూటింగ్ గుట్టుచప్పుడు



కాకుండా జరిగిపోతోంది. అధర్వ - తమన్ నటిస్తున్న సినిమా, శింబు మూవీ, నివిన్ పౌలితో ఒక చిత్రం, జివి ప్రకాష్ కుమార్ తో మరొకటి ఇలా వరసగా తన ఖాతాలో పడ్డాయని చెన్నై రిపోర్ట్. రవితేజ - కిషోర్ తిరుమల కాంబో కోసం తనను సంప్రదించినట్టు లేటెస్ట్ అప్డేట్. ఇంకా అధికారికంగా ప్రకటించలేదు కానీ దాదాపుగా ఖరారైనట్టే. ఇలా మొత్తం అరడజను పైగా కమిట్ మెంట్లతో ఉన్న కయదు లోహర్ డైరీ చూస్తే ఇంకో రెండేళ్ల దాకా కాల్ షీట్లు దొరకడం అనుమానంగానే ఉంది. అంతేమరి విజయలక్ష్మి తలుపు తడితే కెరీర్ ఇలా మారిపోతుంది. తెలుగు తమిళంకు సమాన ప్రాధాన్యం ఇస్తానంటున్న కయదు లోహర్ రెమ్యునరేషన్ కూడా అంతే భారీగా పెరిగిందట. డ్రాగన్ ముందు వరకు ఛాన్స్ రావడమే ఎక్కువనుకుంటే ఇప్పుడు ఎంత అడిగినా ఇచ్చేందుకు నిర్మాతలు రెడీగా ఉన్నారు.

## ఈ అమ్మాయి యాక్టరే కాదు..

డాక్టర్ కాబోయి యాక్టర్ అయ్యా.. ఒకప్పుడు చాలామంది హీరోలు, హీరోయిన్లు ఈ మాట చెప్పేవారు. ఐతే గతంలో సినిమాల్లోకి రావాలంటే చదువు పక్కన పెట్టేయాల్సిందే అనుకునేవారు. కానీ ఇప్పుడు అలా కాదు. చదువుకుంటూ సినిమాలు చేస్తున్న వాళ్లున్నారు. చదువు పూర్తి చేసి సినిమాల్లోకి అడుగు పెడుతున్న వాళ్లూ ఉన్నారు. ప్రస్తుతం టాలీవుడ్లో డాక్టర్ అయ్యాక యాక్టర్లు అయిన వాళ్ల జాబితా పెద్దదే. సీనియర్ హీరోల్లో ఒకరైన రాజశేఖర్ ముఖానికి రంగేసుకోవడానికి పూర్వం డాక్టర్ అన్న సంగతి తెలిసిందే. ఇక క్యారెక్టర్ రోల్స్‌తో పాపులర్ అయిన భరత్ కూడా డాక్టరే. హీరోయిన్లలో ఈ జాబితాలో కొంచెం పెద్దదే. సాయిపల్లవి, మీనాక్షి చౌదరి, శ్రీ లీల, రూప కొడవయూర్, కామాక్షి భాస్కర్ల.. ఇలా



చాలామందే డాక్టర్స్ టర్న్డ్ యాక్టర్స్ ఉన్నారు. ఈ జాబితాలోకి కొత్తగా చేరిన పేరు.. కోమలి ప్రసాద్. ఇటీవలే విడుదలై బ్లాక్ బస్టర్ అయిన నాని సినిమా 'హిట్-3'లో కోమలి కీలక పాత్ర పోషించింది. రఫ్ అండ్ టఫ్ పోలీసాఫీసర్ పాత్రలో ఈ తెలుగమ్మాయి అదరగొట్టింది. హీరోయిన్ తర్వాత అంత ముఖ్యమైన లేడీ క్యారెక్టర్ తనదే. ఈ అమ్మాయి డెంటిస్ట్ అట. టీనేజీలోనే తాను నటి కావాలని అనుకున్నానని.. కానీ చదువు పూర్తయ్యాకే ఏదైనా అని చెప్పడంతో డెంటల్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసినట్లు ఆమె తెలిపింది. తర్వాత ఎంఎస్ కూడా చేద్దామని అనుకున్నానని.. కానీ అప్పుడే తనకు 'నేను సీతాదేవి' అనే సినిమాలో అవకాశం రావడంతో ఆ అప్లికేషన్ పక్కన పడేసి సినిమాల్లోకి వచ్చినట్లు వెల్లడిరచింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in